ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
3
గురువారం 27 జూన్ 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 27.0



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

94910 41488

» ప్రజా సమస్యలపై ఫోన్ చేయండి

» కలెక్టర్ వెట్రిసెల్వి.. బాధ్యతల స్వీకరణ

ఏలూరు కలెక్టరేట్, జూన్ 26 : జిల్లా కలెక్టర్‌గా కె.వెట్రిసెల్వి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించిన ఆమెను జేసీ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీడీ ఎం.సూర్యతేజ, డీఆర్వో పుష్పమణి, ఆర్డీవోలు ఎన్.ఎస్.ఖాజావలీ, కె.అద్దయ్య, వివిధ శాఖల అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'జిల్లా అభివృద్ధికి కృషి చేసి, అన్ని రంగాల్లోను అభివృద్ధి పథంలో నడిపిస్తా. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా.. పోలవరం ప్రాజెక్టు తొలి ప్రాధాన్యతగా తీసుకుంటా. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ఫిర్యాదులు సత్వరమే పరిష్కరిస్తాం. ప్రజలు తమ సమస్యలను నేరుగా ఫోన్ 94910 41488 నెంబర్‌కు తెలపండి. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటా. జిల్లాను రాష్ట్రంలోనే అత్యుత్తమ స్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తా. కలెక్టర్‌గా ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు' అంటూ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు : పీవో

బుట్టాయగూడెం, జూన్ 26 : గిరిజన సమస్యల పరిష్కారానికి అన్నిశాఖల అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కేఆర్ పురం ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఐటీడీఏలో బుధవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి సమస్యలపై వినతులను స్వీకరించారు. నిర్వాసితుల కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆర్&ఆర్‌లో సమస్యలను పరిష్కారించాలని, భూమికి భూమి, నష్టపరిహారం ఇవ్వాలని, ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయాన్ని అందించాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని పలువురు కోరారు. వీటి పరిష్కారానికి పీవో భరోసా ఇచ్చారు.

మేకను చంపిన చిరుత

» విజరాం పంచాయతీ సున్నాలగండిలో ఘటన 5

కొరవడిన.. సహకారం!



> ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. సహకార వ్యవస్థ స్ఫూర్తికి విరుద్ధంగా సంఘాల పాలన జరుగుతున్నది. ఏళ్ల తరబడి ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ కమిటీల ఏలుబడిని కొనసాగిస్తుండటంతో సంఘాల సాధారణ పాలన, నిర్ణయాలు, ఆర్థిక నిర్వహణ లోపభూయిష్టంగా ఉంటోంది. సంఘాల సభ్యులతో ఎన్నిక కాబడిన పాలకవర్గం లేకపోవడం, ఐదేళ్ల పాటు నామినేటెడ్ కమిటీలనే కొనసాగించడంతో సంఘాల పాలిట శాపంగా మారింది.

సందిగ్ధంలో సహకార సంఘాలు

» ఆరేళ్లుగా ఎన్నికలు లేవు

» నామినేటెడ్ కమిటీల ఏలుబడిలో అంతా ఏకపక్ష పాలన

» నష్టాల బారిన పీఏసీఎస్‌లు

ముదినేపల్లి, జూన్ 26 : సహకార రంగ చరిత్రలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఆరేళ్లుగా ఎన్నికలు జరగలేదు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్నికైన పాలకవర్గ పదవీ కాలాన్ని ఏడాది పాటు పొడిగించగా, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పీఏసీఎస్‌ల ఎన్నికల జోలికే వెళ్లలేదు. ఐదేళ్ల పాటు త్రిసభ్య నామినేటెడ్ కమిటీలనే కొనసాగించింది. దీంతో సంఘాలు వైసీపీ నేతల ఆధీనంలోనే ఉండిపోయాయి. సంఘాల్లో ఏ జరుగుతున్నదో తెలియని పరిస్థితి ఏర్పడింది. పలు సంఘాల్లో సిబ్బందిని తమ ఇష్టానుసారంగా తొలగించినట్టు తెలిసింది. సహకార సంఘాలకు చివరిసారిగా 2013 ఎన్నికలు జరిగాయి. నామినేటెడ్ కమిటీల నియామకం సహకార చట్టానికే విరుద్ధం. అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లు నామినేటెడ్ కమిటీలనే కొనసాగించింది. దీంతో బాధ్యతగా వ్యవహరించే పాలక వర్గాలు లేకుండా పోయాయి.

డీసీసీబీకీ నామినేట్

పీఏసీఎస్‌లకే కాకుండా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌కూ డైరెక్టర్లు, చైర్మన్‌లను వైసీపీ ప్రభుత్వం నామినేట్ చేసేసింది. సంఘ సభ్యుల ద్వారా పీఏసీఎస్‌లకు చైర్మన్‌గా ఎన్నికై డీసీసీబీకి డైరెక్టర్లుగా ఎన్నిక కావాలి. ఆ డైరెక్టర్లలో ఒకరిని డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. పీఏసీఎస్‌లకు నామినేటెడ్ కమిటీలను వేయడంతో డీసీసీబీకి ఆ నామినేటెడ్ కమిటీల్లోని ఒక సభ్యుడిని చైర్మన్‌గా ప్రభుత్వం నామినేట్ చేసి ఐదేళ్లు గడిపేసింది. అంటే తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యే స్థాయి నాయకుడిని ఒక పీఏసీఎస్ త్రిసభ్య కమిటీలో సభ్యుడిగా నియమించి జిల్లా స్థాయి బ్యాంక్‌కు చైర్మన్‌గా నియమించడం సహకార స్ఫూర్తిని దెబ్బతీసినట్టయింది.

నష్టాల బారిన సొసైటీలు

పీఏసీఎస్‌లు నష్టాల బారిన పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. నాబార్డు రుణ సౌకర్యంతో సంఘాల పరిధిలో నిర్మించనున్న గొడౌన్ల నిర్మాణం మరింత నష్టం తెచ్చి పెడుతున్నది. సుమారు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల రుణంతో కేంద్ర ప్రభుత్వం సంఘాల్లో గొడౌన్లు నిర్మించాలని ఆదేశాలు జారీ చేసింది. వీటి నిర్మాణానికి అవసరమైన స్థలాలు అందుబాటులో లేవు. ఒకవేళ నిర్మించినా దానిని రైతులు వినియోగించకపోతే సంఘాలకు ఆదాయం రాదు. రుణం వాయిదాల ప్రకారం సంఘం చెల్లించాల్సిందే. దీనివల్ల సంఘం ఆర్థికంగా దెబ్బతినే పరిస్థితి ఉంది. రైతులు వినియోగించుకోలేని ప్రదేశాల్లో గొడౌన్ల నిర్మాణం చేశారు. అదీ త్రిసభ్య కమిటీల నిర్వాకమే.

పూర్తికాని కంప్యూటరీకరణ

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పూర్తి కాలేదు. సంఘాల రికార్డులు కంప్యూటరీకరణ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సక్రమంగా అమలు చేయలేదు. కంప్యూటరీకరణకు ఖర్చును కేంద్ర ప్రభుత్వం, ఏపీ రాష్ట్ర సహకార బ్యాంకు సంయుక్తంగా భరించాలి. అయితే ఈ ఖర్చును సంఘాలే భరించాల్సి రావడంతో ఆర్థిక భారం పెరిగింది. ఇప్పటికే సిబ్బందికి జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉన్న చాలా సంఘాలకు గొడౌన్ల నిర్మాణ రుణ వాయిదాలు చెల్లించడం, కంప్యూటరీకరణకు అయ్యే ఖర్చును భరించడం నష్టాలు తెచ్చి పెడుతున్నాయి.

41 శాతం పాస్

» ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 26 : ఇంటర్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జనరల్ విభాగంలో 3,228 మంది పరీక్షలకు హాజరుకాగా 1,326 మంది (41 శాతం), ఒకేషనల్ విభాగంలో 473 మంది విద్యార్థులు హాజరు కాగా 259 మంది (55 శాతం) ఉత్తీర్ణులయ్యారని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. మార్కుల జాబితాలను జూలై ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. జవాబుపత్రాల రీ-వెరిఫికేషన్‌కు జూలై 4వ తేదీలోగా ఇంటర్ బోర్డుకు ఆన్‌లైన్ ద్వారా రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కాగా ఎయిడెడ్ కళాశాలలు 18 శాతంతో అతితక్కువ ఉత్తీర్ణతను సాధించగా, నూరుశాతం ఉత్తీర్ణతను కేజీబీవీలు నిలబెట్టుకున్నాయి. హైస్కూల్ ప్లస్‌లలో 32 శాతం ఉత్తీర్ణత మాత్రమే నమోదైంది.

52.24 శాతం పాస్

» పది సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 26 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు బుధవారం రాత్రి విడుదలయ్యాయి. జిల్లాలో ఈ పరీక్షలకు మొత్తం 6,849 మంది బాల బాలికలు హాజరుకాగా, వీరిలో 3,578 మంది (52.24 శాతం) ఉత్తీర్ణులయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణుల్లో 2,083 మంది బాలురు, 1,495 మంది బాలికలు ఉన్నారన్నారు. మార్కుల జాబితాలను సంబంధిత స్కూలు హెచ్‌ఎం లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు స్కూలు హెచ్‌ఎంకు నిర్ణీత ఫీజు చెల్లించి జూలై ఒకటో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆరో రోజూ వర్షాలు

ఏలూరు సిటీ, జూన్ 26 : జిల్లాలో నైరుతి రుతు పవనాల ప్రభావంతో జిల్లాలో ఆరు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. మంగళవారం రాత్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా ద్వారకా తిరుమల మండలంలో 18.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో గడచిన 24 గంటల్లో సరాసరి వర్షపాతం 1.7 మి.మీగా నమోదైంది. పెదవేగిలో 10.2, దెందులూరులో 8.4, కైకలూరులో 5.8, లింగపాలెంలో 1.8, ఆగిరిపల్లిలో 1.2, నూజివీడులో 0.8, కామవరపు కోటలో 0.8, భీమడోలులో 0.4 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

వైసీపీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుంటాం : ఎమ్మెల్యే చంటి



వైసీపీ కార్యాలయాన్ని చూపుతున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు టూ టౌన్, జూన్ 26: 'అధికార బలంతో ఏలూరులో వైసీపీ కార్యాలయాన్ని ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించారు. కూటమి ప్రభుత్వం రాగానే దీన్ని రెగ్యులర్ చేయాలని రూ.14 లక్షలు కట్టారు. ఎన్ని లక్షలు కట్టిన క్రమబద్ధీకరించే ప్రసక్తే లేదు. ప్రభుత్వం ఈ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుంటుంది' అని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) తేల్చి చెప్పారు. అనుమతులు లేకుండా ఏలూరులో నిర్మించిన వైసీపీ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. 'వైసీపీ కార్యాలయాన్ని నిర్మించిన స్థలాన్ని 2006లో డాన్ అనే కంపెనీకి కమర్షియల్ కాంప్లెక్స్‌కు అప్పటి ప్రభుత్వం కేటాయించింది. అనంతరం ఆ కంపెనీతో అగ్రిమెంట్ క్యాన్సిల్ చేయకుండా గత ప్రభుత్వ హయాంలో ఆ స్థలంలో వైసీపీ కార్యాలయ నిర్మాణం చేపట్టారు. ఇందుకు నగర పాలక సంస్థ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుంచి 33 ఏళ్లకు ఎకరానికి రూ.వెయ్యి ఇచ్చే విధంగా లీజుకు తీసుకున్నారు. తక్షణం వైసీపీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోవాలి' అని కమిషనర్ వెంకటకృష్ణను ఆదేశించారు. ఈ కట్టడాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కానీ, జూనియర్ కళాశాలలకు కానీ, వసతి గృహాలకు కానీ వినియోగిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా నాణ్యత?

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లను ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో గోతులతో దారుణంగా మారాయి. కనీసం మరమ్మతులు సైతం నాణ్యతగా చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో గత తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు సంబంధిత అధికారులు పరుగులు తీస్తున్నారు. దీనికి వేలేరుపాడులో చేపట్టిన రోడ్డు మరమ్మతులే ఉదాహరణ. మరమ్మతులు చేసిన ఇరవై రోజులకే మరల రోడ్డు యథాస్థితికి చేరడం గమనార్హం. మరోవైపు జీలుగుమిల్లి-పోలవరం రోడ్డును మరమ్మతుల పేరిట పదిహేను రోజుల్లో రెండుసార్లు పనులు చేపట్టగా ఇప్పుడది కంకర పైకి లేచి అధ్వానంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జీలుగుమిల్లిలో మంగళవారం రోడ్డు తవ్వి మరమ్మతులు

▪ పదిహేను రోజుల్లో రెండుసార్లు..

జీలుగుమిల్లి : మరమ్మతుల పేరుతో బాగున్న రోడ్డును సైతం పలుసార్లు తవ్వివేస్తుండటంతో ప్రజలు అవాక్కవుతున్నారు. జీలుగుమిల్లి-పోలవరం రోడ్డు జాతీయ రహదారి (ఎన్‌హెచ్-360 బీబీ)గా మారడంతో గతంలో తాటియాకులగూడెం, జీలుగుమిల్లి, కామయ్యపాలెం వాగు వద్ద, బర్రింకలపాడు, పి.అంకంపాలెం వయా బుట్టాయ గూడెం వరకు రోడ్డు మరమ్మతు పనులు చేశారు. అనంతరం ఆ రోడ్డుపై వాహనాలు తిరగడంతో రహదారిపై కంకర గుట్టలుగా పైకి లేచింది. దీంతో ఈనెల 11వ తేదీన జీలుగుమిల్లి ప్రధాన సెంటరులో రోడ్డు మరమ్మతుల పేరుతో రోడ్డు బాగున్న చోట తవ్వి మరలా రోడ్డు నిర్మాణం చేపట్టారు. మరల మంగళవారం జగదాంబ ఆలయం ఎదుట జాతీయ రహదారి మరమ్మతు పనులంటూ రోడ్డు తవ్వారు. బిల్లుల కోసం తరచూ రోడ్డు తవ్వి పోస్తున్నారని, మిగిలిన ఆర్‌అండ్‌బీ, జిల్లా పరిషత్ రోడ్లను పట్టించుకోవడం స్థానికులు వాపోతున్నారు.



జీలుగుమిల్లిలో పదిహేను రోజుల క్రితం జాతీయ రహదారిపై మరమ్మతులు



ఇటీవలే చేపట్టిన మరమ్మతుల దుస్థితి

▪ వేసిన ఇరవై రోజులకే ధ్వంసం

వేలేరుపాడు : వేలేరుపాడు మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ రహదారిని ఇరవై రోజుల క్రితం మరమ్మతులు చేసి పైన తారు వేశారు. అయితే ఆ రోడ్డుపై పలుచోట్ల తారులేచిపోయి మళ్లీ గుంతలుగా ఏర్పడుతున్నాయి. గతేడాది మార్చిలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారికి మరమ్మ తులకు నిధులు మంజూరు కాగా అక్కడక్కడ ఉన్న గుంతలను పూడ్చి ప్యాచ్‌వర్క్ చేశారు. అయితే మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై సుమారు 400 మీటర్ల మేర భారీగా గోతులు పడి రోడ్డు మొత్తం ధ్వంసం కావడంతో ఇక్కడ మరమ్మతు పనులకు నిధులు చాలడం లేదన్న కారణంతో నిలిపివేశారు. చుట్టుపక్కల మరమ్మతులు చేసి మండల కేంద్రంలో చేయకపోవడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయగా ఇదే విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం కూడా వచ్చింది. అయినా అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం, అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ఆగమేఘలామీద ఈ రహదారి మరమ్మతులను ప్రారంభించారు. గుంతల పడ్డ రోడ్డుపై కంకరతోలి దాన్ని సరిగా రోలింగ్ చేయకుండా వెంటనే తారుపోసి మమా అనిపించారు. రోడ్డుకు ఇరువైపులా సైడ్‌బర్మ్‌కు గ్రావెల్ తోలాల్సి ఉండగా చౌడుమట్టి తోలటంతో ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారింది. రోడ్డుపై వేసిన తారుకూడా లేచిపోయి రహదారి మరలా కుంగిపోతోంది. ఇరవై రోజులకే రహదారి దెబ్బతినడంతో ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రహదారి మరమ్మతులను ఒక కాంట్రాక్టరు చేపట్టి పనులు చేయ గా అప్పట్లో మిగిలిపోయిన ఈ బ్యాలెన్సింగ్ వర్కుకు మంజూరైన నిధులను అప్పట్లో కాజేసిన అధికారులు ప్రభుత్వం మారడంతో తమపై చర్యలు తీసుకుంటారే మోనన్న భయంతోనే ఆగమేఘలా మీద మూడు రోజుల్లోనే రహదారి మరమ్మతుల పనులు పూర్తి చేశారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ మరమ్మతు పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరి పించి అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కొల్లేరులో అక్రమ చెరువు గట్ల ధ్వంసం



కైకలూరు, జూన్ 26 : కొల్లేరు అభయారణ్యంలోని కైకలూరు మండలం పల్లెవాడలో అక్రమంగా తవ్విన చేపల చెరువు గట్లను బుధవారం అటవీ శాఖ అధికారులు ధ్వంసం చేశారు. రెండు రోజులుగా కొల్లేరు అభయారణ్యంలో గుట్టు చప్పుడు కాకుండా రాత్రి సమయాల్లో ఎక్స్‌కవేటర్లతో జువ్వకనుముల కాల్వ గట్టును ఆక్రమించుకొని యథేచ్ఛగా తవ్వకాలను చేపట్టారు. 10.46 ఎకరాలు చెరువును అక్ర మార్కులు అడ్డగోలుగా తవ్వేశారు. రెండు రోజులుగా తవ్వకాలు జరుగుతున్నా అటవీ అధి కారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఎట్టకేలకు అటవీశాఖ డిప్యూటీ రేంజర్ జయప్రకాష్ ఆధ్వర్యంలో గట్లను ధ్వంసం చేశారు. అయితే పూర్తిస్థాయిలో గట్లను ధ్వంసం చేయకుండా నామమాత్రంగా ధ్వంసం చేశారన్న విమర్శలు విన్పిస్తున్నాయి.

డైరెక్టర్ పోస్టు కోసం..!

» నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ పోస్టుకు తీవ్ర పోటీ

» మరోసారి అవకాశం కోసం గత డైరెక్టర్ల ప్రయత్నాలు

నూజివీడు/నూజివీడు టౌన్, జూన్ 26 : నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ పదవికి తీవ్ర పోటీ నెలకొంది. ఆది నుంచి పాడికుండగా పేరు పడిన నూజివీడు ట్రిపుల్ ఐటీ అభివృద్ధి పనులను ఆసరాగా తిరిగి డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు గతంలో ఇక్కడ పనిచేసిన వారు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సలహాదారైన సజ్జల రామకృష్ణారెడ్డి ద్వారా ఇక్కడ డైరెక్టర్‌గా దాదాపు ఖరారు అయ్యారని, ట్రిపుల్ ఐటీలో గతంలో డైరెక్టర్‌గా పనిచేసిన ఓ వ్యక్తి పేరు ప్రచారం సాగింది. అయితే సదరు వ్యక్తికి ప్రొఫెసర్‌గా పదేళ్ల ఎక్స్‌పీరియన్స్ లేదని ఆర్జీయూకేటీ ఛాన్సలర్ కె.సిరెడ్డి అభ్యంతరం చెప్పడంతో డైరెక్టర్‌గా తిరిగి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించి విఫలం అయ్యారు. అయితే తాజాగా ఆ వ్యక్తికి ఎక్స్‌పీరియన్స్ రావడంతో పాటు ఇటు ప్రభుత్వం మారడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలోని కొందరు కాంట్రాక్టర్ల సహాయంతో డైరెక్టర్‌గా వచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

డైరెక్టర్‌గా వచ్చేందుకు పోటీ

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రస్తుతం డైరెక్టర్‌గా పోటీ పడుతున్న వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా గతంలో డైరెక్టర్‌గా ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించారు. అయితే ఆ సమయంలోనే నూజివీడు ట్రిపుల్ ఐటీలో భూసేకరణతో పాటు అనేక అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టులు నిర్వహించారు. అయితే ఇంకా 30 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉంది. భూసేకరణలో కోట్ల రూపాయల వ్యవహారం ముడిపడి ఉండడంతో ఈ డైరెక్టర్ పదవికి డిమాండ్, తీవ్ర పోటీ ఏర్పడింది. ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టి అడుగులు ముందుకు వేస్తుండగా, అదే అభివృద్ధి అంశాన్ని ఉపయోగించుకుని ఇక్కడ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా లాభపడవచ్చనే ఉద్దేశంతో పాత డైరెక్టర్లు తీవ్రస్థాయిలో పోటీ పడుతున్నట్టు తెలుస్తోంది.



గతంలో పలు ఆరోపణలు

ప్రస్తుతం డైరెక్టర్‌గా పోటీ పడుతున్న వ్యక్తి నూజివీడు ట్రిపుల్ ఐటీలో పనిచేసిన సమయంలో నూజివీడు ట్రిపుల్ ఐటీలో జరిగిన అనేక వివాదాస్పద అంశాలపై ఆరోపణలు వచ్చాయి. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా విద్యా ప్రాంగణంలో ఏకంగా మత ప్రార్థనలు చోటు చేసుకున్న అంశం వెల్లడి కావడం అది రుజువు కావడంతో అనేక మందిపై చర్యలు తీసుకున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో అమలైన ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సులను ఎత్తివేయడం మరో వివాదాస్పద అంశంగా నిలిచింది. నాడు మెస్‌లలో భోజన నాణ్యత బాగోలేదంటూ విద్యార్థులు సైతం రోడ్డు ఎక్కడంతో నాటి ఉన్నత విద్యాశాఖ మంత్రి ఘంటా శ్రీనివాసరావు ట్రిపుల్ ఐటీని సందర్శించారు. ఆ సమయంలో ఆర్జీయూకేటీ టాపర్‌గా నిలిచిన శివకుమార్ అనే విద్యార్థి ట్రిపుల్ ఐటీ విద్యావిధానంలో భారీ లోపాలు ఉన్నాయని, అధ్యాపకులు తమకు బోధించింది ఏమీ లేదని, కేవలం తాము సొంతంగా చదివి, ఈ స్థాయిలో నిలిచామే కాని తాము ర్యాంకులు సాధించడంలో అధ్యాపకుల పాత్ర ఏమీ లేదని పేర్కొనడం నాడు సంచలనంగా నిలిచి నాటి ప్రతిపక్షం వైసీపీకి ఆయుధంగా సైతం మారింది. ఇలాంటి అనేక వివాదాల నేపథ్యంలో అదే డైరెక్టర్ తిరిగి నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా వచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తుండడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిలో తీవ్ర ఆందోళన నెలకొంది.

జీతం ఇవ్వకుంటే కుటుంబంతో ఆత్మహత్య



ఏలూరు ప్రభుత్వాస్పత్రి వద్ద పురుగుల మందు, పెట్రోల్ బాటిల్‌తో ఆరోగ్యశ్రీ ఉద్యోగి ఆందోళన

ఏలూరు క్రైం, జూన్ 26 : ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో తాము ఎలా బతకాలంటూ ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆరోగ్యశ్రీ విభాగం స్ట్రెక్చర్ బాయ్(ఎంఎన్‌వో) మేడిద దుర్గారావు ఆందోళన చేపట్టాడు. ఫిబ్రవరి నుంచి ఆ విభాగంలో పని చేసే 22 మంది సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదు. ఈ క్రమంలో దుర్గారావు తన భార్య, ఇద్దరు పిల్లలతో బుధ వారం ఉదయం ప్రభుత్వాస్పత్రికి వచ్చాడు. పురుగుల మందు డబ్బా, పెట్రోల్ బాటిల్ పట్టుకుని జీతాలు ఇవ్వకపోతే తామంతా ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. తన కుమార్తె అనారోగ్యంతో బాధపడుతోందని, పైసా అప్పు పుట్టలేదని, జీతాలు ఇచ్చి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదంటూ బోరున విలపించాడు. పరిస్థితి గమనించిన తోటి ఉద్యోగులు అతనికి నచ్చచెప్పి ఆస్పత్రి సూపరింటెండెంట్ రూమ్ దగ్గర నుంచి తీసుకువెళ్ళిపోయారు. డీఎంఈ అనుమతి లేకపోవడం వల్లే జీతాలు ఇవ్వలేకపోతున్నారని, అనుమతి రాగానే చెల్లిస్తారని ఆస్పత్రి అధికారి వెల్లడించారు.

ట్రామా కేర్ ఉద్యోగుల పరిస్థితి ఇంతే..

ఏలూరు ప్రభుత్వాస్పత్రి ట్రామాకేర్ ఉద్యోగులకూ ఐదు నెలల నుంచి జీతాలు లేవు. కేంద్ర ప్రభుత్వం నిధులతో ఈ ట్రామాకేర్ సెంటర్ కొనసాగుతుంది. ఇప్పటి వరకు వైద్య విధాన పరిషత్ ద్వారా వారికి జీతాలు ఇచ్చారు. వైద్య విధాన పరిషత్ నుంచి ఆస్పత్రి మెడికల్ కాలేజీలో విలీనం కావడంతో ఈ ఉద్యోగులు ఎవరి పరిధిలో ఉన్నామో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. వారు పనిచేసేది మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో, కాని ఉద్యోగంలో ఉన్నది మాత్రం వైద్య విధాన పరిషత్‌లో. ఎవరు జీతాలు ఇస్తారో తెలియని పరిస్థితి. 33 మంది ఉద్యోగులకు కొన్నేళ్ళుగా వివిధ కారణాలతో కొందరు రాజీనామా చేయగా ప్రస్తుతం 19 మంది కొనసాగుతున్నారు.

చిన్నారికి మంత్రి నిమ్మల వైద్య సాయం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని పలకరిస్తున్న మంత్రి రామానాయుడు

పాలకొల్లు టౌన్, జూన్ 26 : పాలకొల్లుకు చెందిన పదమూడు నెలలు చిన్నారి అక్షర కిడ్నీ సమస్యతో బాధపడుతున్న తీరును, ఆరోగ్య పరిస్థితిని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి చిన్నారి తల్లిదండ్రులు వివరించారు. ఈమేరకు ఆయన స్పందించి వైద్యసాయం అందిస్తానని హామీ ఇచ్చారు. విజయవాడ మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని బుధవారం రాత్రి ఆయన వెళ్లి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు. చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ అధైర్య పడొద్దని, ప్రభుత్వ సాయం అందుతుందని, రూపాయి ఖర్చు పెట్టనవసరం లేదని అంతా చూసుకుంటానని భరోసా ఇచ్చారు. ఆసుపత్రిలో ఏదైనా ఇబ్బంది వస్తే తనకు ఫోన్ చేయాలని సూచించారు. ఆయనకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మళ్లీ పులి భయం..

▸ సున్నాలగండిలో మేకను చంపిన చిరుత

పోలవరం, జూన్ 26 : చిరుత పులి దాడిలో మేక మృతి చెందిన ఘటన పోలవరం మండలం వింజరం పంచాయతీ సున్నాలగండి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలవరం అటవీక్షేత్రాధికారి ఎస్.దావీదురాజు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన మడకం కోటేశ్వరరావు అనే మేకల కాపరికి చెందిన పాకలో ఒక మేక కనిపించక పోవడంతో సమీప అటవీ ప్రాంతంలో వెతికినట్టు తెలిపారన్నారు. మేకల పాకకు కొంతదూరంలో తలభాగం పూర్తిగా తిని మిగిలిన మేక కళేబరం కనిపించిందని మేకల కాపరి ఇచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతానికి అటవీశాఖ సిబ్బందిని పంపినట్టు తెలిపారు. సిబ్బంది సేకరించిన పాదముద్రల మేరకు దాడికి పాల్పడింది చిరుతపులేనని ధ్రువీకరించినట్టు తెలిపారు. మేక కళేబరాన్ని పశువైద్యులతో పరీక్షించి మేకల కాపరికి అటవీశాఖ నుంచి పరిహారం అందిస్తామని.. అడవుల్లోకి పశువులను మేపడానికి వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని గ్రామస్థులకు సూచించినట్టు తెలిపారు.



మేక కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

పొగాకు @ 363

▸ ఆల్‌టైమ్ రికార్డుకు చేరుకున్న వర్జీనియా ధర
▸ రైతుల హర్షం

జంగారెడ్డిగూడెం, జూన్ 26 : ఎన్ఎల్ఎస్ చరిత్రలోనే ప్రప్రథమంగా వర్జీనీయా పొగాకు ధర బుధవారం రూ.363కు చేరి ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. ఇంతటి ధర మునుపెన్నడూ లేకపోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2024 మార్చి ఆరో తేదీన జంగారెడ్డిగూడెంలో రెండు వేలం కేంద్రాల్లో వేలం ప్రారంభమైంది. అప్పటి ప్రారంభ ధర రూ.240 మాత్రమే ఉంది. ఆ ధర చూసిన రైతుల్లో నిరుత్సాహం నెలకొంది. వేలం చివరి వరకు ఇదే ధర కొనసాగితే రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వచ్చేది. క్రమక్రమంగా ధరలు రైతులకు ఆశాజనకంగా పెరగడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఈనెల 20న రూ.266 ఉండగా 22వ తేదీకి రూ.272, 24వ తేదీకి రూ.287, 25వ తేదీకి రూ.303కి చేరుకోగా 26వ తేదీ బుధవారం నాటికి ఏకంగా వేలం కేంద్రం-1లో రూ.361, వేలం కేంద్రం-2లోను, కొయ్యలగూడెం వేలం కేంద్రంలోనూ అత్యధిక ధర రూ.363కు చేరుకుంది. పొగాకు వేలం చరిత్రలో ఇంతటి ధర పలకడం ఇదే ప్రథమం అని జంగారెడ్డిగూడెం రెండు వేలం కేంద్రాల ఆక్షన్ సూపరింటెండెంట్‌లు బి.శ్రీహరి, జె.సురేంద్రకుమార్ ఆంధ్రజ్యోతి తెలిపారు. వేలం కేంద్రం 32 నంబరు రైతు సంఘం అధ్యక్షుడు సత్రం వెంకట్రావు మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు వేలం ప్రారంభంలో రూ.240 నుంచి క్రమక్రమంగా రూ.363కి చేరడంపై రైతులు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. వేలం ఆఖరి వరకూ ఇదే ధర వస్తే మిచౌంగ్ తుఫాన్‌లో నష్టపోయిన రైతులకు చాలా వరకు ఊరట కలుగుతుందన్నారు.



వేలం కేంద్రంలో అధికారులు, కంపెనీల ప్రతినిధులు



జీలుగుమిల్లి పామాయిల్ తోటలో తాచుపాములు

తాచు పాముల హల్‌చల్

జీలుగుమిల్లి, జూన్ 26 :జీలుగుమిల్లి గ్రామ సమీప పామాయిల్ తోటలో రెండు తాచు పాములు బుధవారం మసకలాడు తున్నాయి. పొలం పనులకు వచ్చిన కూలీలు కొందరు పామాయిల్ తోటలో రెండు తాచుపాముల్ని చూసి భయాందోళనకు గురయ్యారు. రైతుకు సమాచారం ఇచ్చారు. రైతు ప్రసాద్ అక్కడకు చేరుకుని రెండు పాములు పెనవేసుకుని నాట్యం చేస్తున్నట్టు అడుతున్న దృశ్యాల్ని సెల్‌ఫోన్‌లో బంధించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

మహిళలకు న్యాయం జరగాలి

▸ ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశం



దిశ పోలీస్ స్టేషన్‌లో మహిళల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ ప్రశాంతి

ఏలూరు క్రైం, జూన్ 26 : నాలుగు గోడల మధ్య ఉండే మహిళలు మహిళా పోలీస్ స్టేషన్‌కు వస్తున్నారంటే వారి బాధను అర్థం చేసుకుని వారికి న్యాయం జరిగేలా ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డి. మేరీ ప్రశాంతి ఆదేశించారు. ఏలూరులో ఉన్న మహిళా పోలీస్ స్టేషన్‌ను బుధవారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ వద్దకు వచ్చిన పలువురు ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ఇన్‌స్పెక్టర్ విశ్వం, ఎస్ఐ కాంతిప్రియ నుంచి స్టేషన్‌లో కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని, ప్రతి ఫిర్యాదును రిసెప్షన్ సెంటర్‌లో నమోదు చేసి రసీదు ఇవ్వాలన్నారు. కేసు దర్యాప్తులో అలసత్వం వహించరాదని అధికారులను హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల బాధలను సహృదయంతో మాట్లాడి సమస్య తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలని, పోలీస్ స్టేషన్ ప్రాంతం పచ్చదనంగా ఉండేలా మొక్కలను నాటాలని సూచించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠినచర్యలు : ఈఈ



మధుకుమార్

పెదవేగి, జూన్ 26 : విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విద్యుత్ తనిఖీ విభాగం ఈఈ కె.మధుకుమార్ హెచ్చరించారు. బుధవారం లక్ష్మీపురం గ్రామంలో సూరెడ్డి వెంకటేశ్వరరావు, సూరెడ్డి సుభాషిణి అనే ఇరువురు వ్యక్తులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారనే సమాచారంతో దాడులు చేసి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన సూరెడ్డి వెంకటేశ్వరరావు వ్యవసాయ సర్వీసునుంచి పశువులశాలకు విద్యుత్‌ను అక్రమంగా వినియోగాన్ని గుర్తించడంతో పాటు అదనపు లోడును వినిగిస్తున్నట్లు గుర్తించి దానిపైకూడా నమోదు చేశామన్నారు. అదే గ్రామానికి చెందిన సూరెడ్డి సుభాషిణి కేటగిరి-1 ఇంటి సర్వీసునుంచి విద్యుత్‌ను తీసుకుని తనకు చెందిన నాటుకోళ్ల ఫారమ్‌కు అక్రమంగా వినియోగిస్తున్నట్టు గుర్తించి ఆమెపై కేసునమోదు చేశామన్నారు. విద్యుత్ అక్రమ వినియోగం నేరమని, ఎవరైనా విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నట్టు తేలితే జరిమానాతో పాటు చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీవారి క్షేత్రానికి నాగసాధువులు



శ్రీవారి అనివేటి మండపం వద్ద నాగసాధువులు

ద్వారకాతిరుమల, జూన్ 26: చినవెంకన్న క్షేత్రాన్ని పలువురు నాగ సాధువులు బుధవారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన వీరిని తిలకించిన భక్తులు పరవశిం చారు. వారణాసిలో ఉండే ఈ సాధువులు శివభక్తులుగా చెబుతారు. తాము కాశీనుంచి వచ్చినట్టు వారు తెలిపారు. ఆలయంలో కన్పించిన ఈ నాగసాధువులకు పలువురు భక్తులు ప్రణామాలు తెలిపారు. అరుదుగా కన్పించే వీరిని ఆలయానికి వచ్చిన భక్తులు ఆసక్తిగా తిలకించారు.

భయం.. భయం



వాతావరణం మార్పులతో ప్రజలు సతమతం అవుతున్నారు. ఓవైపు వాన, మరోవైపు ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ మార్పుల కారణంగా ప్రజలు రోగాలభారిన పడుతామన్న భయాందోళన వ్యక్తం అవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో డెంగీ, వైరల్ ఫీవర్స్‌లాంటివి ప్రజలను ఇబ్బందులకు గురిచేశాయి. గ్రామాల్లో పారిశుధ్య నిర్వాహణ అంతంతమాత్రంగా ఉండడంతో పాటు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో ఎటువంటి రోగాల భారిన పడాల్సి వస్తుందోనన్న భయం వెంటాడుతోంది.

వాతావరణ మార్పులతో ప్రజలు సతమతం



▸ వ్యాధుల భారిన పడతామన్న ఆందోళన
▸ అతిసార వ్యాధిపై జిల్లా వైద్యశాఖ అప్రమత్తం
▸ పోస్టర్లతో అవగాహన, ప్రచార కార్యక్రమాలు

భీమవరంటౌన్, జూన్ 26 : ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో ఇప్పటికే పలువురు దగ్గు, రొంప, జ్వరాలతో ఇబ్బందులు పడున్నారు. చిన్న పిల్లలోను జ్వర లక్షణాలు కనిపించడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.జిల్లా వైద్యాధికారులు కూడా గ్రామాల్లోను, పట్టణాలోని వార్డుల్లోనూ జ్వరాలపై సర్వేలు చేయిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి వివరాలను సేకరించుకుంటున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో డయేరియా వ్యాధి విజృంభిస్తున్న నేపథ్యంలో అటువంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా వైద్యశాఖాధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. వర్షకాలం ప్రారంభం కావడంతో అతిసార ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. గత రెండేళ్లుగా ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఎక్కడా అతిసారవ్యాధి కేసులు నమోదు కాలేదు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సరైన పారిశుధ్య నిర్వహణ చేపట్టకపోవడం, స్వచ్ఛమైన తాగునీరు అందించే విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టకపోవడం ఈ వ్యాధులు ప్రబలే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టిపెట్టింది. జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఇప్పటికే ఏఎన్ఎంలకు, ఎంఎల్‌హెపీ, పీహెచ్‌సీ డాక్టర్లు, సచివాలయల్లో ఏఎన్ఎంలకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటుచేసి ముందస్తు చర్యలు నిర్వహిస్తున్నారు.

గ్రామాల వారీగా కమిటీలు

అతిసార వ్యాధి రాకుండా ముందుజాగ్రత్త చర్యలలో భాగంగా గ్రామాల వారీగా వైద్యశాఖ ఆధ్వర్యంలో మండల టాస్క్‌ఫోర్సు కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కమిటీలో వైద్యాధికారులు, పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర శాఖలు కమిటీలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. పలు సూచనలు జారీ చేశారు. గ్రామాల్లో మంచినీటి పైపులైన్‌లు ప్రారంభంలోను, ట్యాప్ వద్ద నీటి నాణ్యత తప్పనిసరిగా పరీక్షలు చేయాలి. ప్రతి పీహెచ్‌సీలోనూ, హెల్త్ సెంటర్‌లోను ఓఆర్ఎస్ జింక్ కార్నర్ ఏర్పాటు చేసుకోవాలి. ఓఆర్ఎస్ స్టాక్‌ను పూర్తిస్థాయిలో ఉంచుకోవాలి. అదేవిధంగా సూపర్‌వైజర్లు, హెల్త్ ఎడ్యుకేటర్స్, ఎంపీహెచ్‌ఈవోలతో అవగాహన సదస్సులు నిర్వహించాలని, మంచినీటి ట్యాంకులను పరిశుభ్రం చేసిన లాగ్ బుక్‌లో క్లోరినేషన్ రీడింగ్‌ను తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

అతిసార వ్యాధి లక్షణాలు ఇలా..

పిల్లలు ఒకరోజు మూడు లేదా అంతకంటే ఎక్కువసార్లు విరోచనం పల్చగా ఉన్నట్టయితే దానిని అతిసార వ్యాధిగా గుర్తించాలి. చిన్నపిల్లలు తల్లి పాలు తాగకపోవడం, తక్కువగా తాగడం, ప్రతీది వాంతి చేసుకుంటూ ఉంటే, తరచుగా మలవిసర్జన పలచగా వెళ్లడం వల్ల తీవ్రమైన నీరసం రావడం, మలంతోపాటుగా రక్తం పడడం, ఆసక్తిలేకుండా ఉండడం, అపస్మారకస్థితిగా ఉండడం, జ్వరంగా ఉండడం, శరీరం తాకితే చల్లగా అనిపించడం, వేగంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడడం, అరచేతులు, అరికాళ్ళు పసుపుచ్చగా మారడం, మూర్ఛ, ఫిట్స్‌వంటి రావడం జరుగుతాయి. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- నివారణ కోసం విటమిన్-ఎ సిరప్ తాగించాలి, స్వచ్ఛమైన తాగునీటిని ఉపయోగించాలి. భోజనానికి ముందు, మరుగుదొడ్డి ఉపయోగంచిన తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. బిడ్డలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. రోటావైరస్, తట్టుకు టీకాలు వేయించాలి.

పోస్టర్లతో అవగాహన కార్యక్రమాలు

పట్టణాల్లోనూ, గ్రామీణ ప్రాంతాలల్లోనూ అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం పోస్టర్లను కూడా జిల్లా వైద్యశాఖ విడుదల చేసింది. గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

డాక్టర్లకు, సిబ్బందికి శిక్షణ తరగతులు

జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో డాక్టర్లకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. వ్యాధి సంక్రమిస్తే ఎటువంటి చర్యలుతీసుకోవాలి, చిన్న పిల్లలకు వస్తే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే దానిపై శిక్షణ ఇస్తున్నారు. మండల స్థాయిలో ఏఎన్ఎంలకు, ఏపీహెచ్ఎల్స్‌కు, మునిసిపాల్టీలో సచివాలయంలోని హెల్త్ సెక్రటరీలకు అవగాహన కల్పిస్తున్నారు.

జాగ్రత్తలు ఇలా..

వేడి ఆహారం తీసుకోవాలి, కాచివడగట్టిన నీటిని తీసుకోవాలి. నిల్వ ఉన్న ఆహారం తినకుండా చూడడం, కలుషిత నీరు తాగకుండా ఉండడం, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం తదితర అంశాలను పాటిస్తే ఈ వ్యాధిని నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపు కీలకం

▸ ఉద్యానవర్సిటీ ఉప కులపతి డాక్టర్ జానకీరామ్



కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వీసీ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 26 : విద్యార్థుల్లో నైపుణ్యం పెంపుదల అత్యంత కీలకమని నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడిని అధిగమించడం, సమ య పాలన, సృజనా త్మకత అవసరమని ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం 17వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం వర్సిటీ ప్రాంగణంలో జాతీయ అకాడమి ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ ద్వారా కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సెంటర్ ద్వారా కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్, పూర్వవిద్యార్థుల కో-ఆర్డినేషన్, ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేషన్, ఐడియా పిట్టింగ్ ప్రోగ్రాంలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ సలోమి సునీత, కళాశాల డీన్ ఎం మాధవి, డీన్ ఆఫ్ హార్టికల్చర్ ఏఎస్ పద్మావతమ్మ, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఎస్. సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు వెంకాయమ్మ మృతి




వెంకాయమ్మ (ఫైల్)

పెనుమంట్ర, జూన్ 26 : మార్టేరుకు చెందిన దివంగత అడబాల సాంబమూర్తి భార్య అడబాల వెంకాయమ్మ(109) మృతి చెందారు. వడలి గ్రామానికి చెందిన ఆమె 1915లో జన్మించారు. భర్త ఉద్యోగరీత్యా వడలి గ్రామం నుంచి వచ్చి మార్టేరులో స్థిరపడ్డారు. ఆమెకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను, ఆటుపోట్లని ఎదుర్కొన్నారు. ఆమెకు వయసు రీత్యా తప్ప ఎటువంటి దీర్ఘకాలిక ఇబ్బందులు లేకుండా జీవించడం గమనార్హం. ఆమెకు 17 మంది మనుమలు, 32 మంది ముని మనములు, ఆరుగురు అనుమనుమలుతో కలిపి మొత్తం 60 మంది కుటుంబసభ్యులు ఉన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

జీలుగుమిల్లి, జూన్ 26 : లక్ష్మీపురం సమీప పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం గ్రామ పొలాల్లో పేకాటాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేసి వారి వద్ద నుంచి రూ. 6,900 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



కొత్తగా జారీచేసే ధ్రువపత్రంపై జగన్ చిత్రం స్థానంలో రాజముద్ర



గతంలో జారీచేసిన ధ్రువపత్రాలపై వున్న జగన్ చిత్రం

ఇక ధ్రువ పత్రాలపై రాజముద్ర

ఏలూరు రూరల్, జూన్ 26 : వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని కార్యాలయాల్లో జారీచేసే ధ్రువపత్రాలపై కన్పించిన నాటి సీఎం జగన్ చిత్రపటం ప్రస్తుతం కనుమరుగైంది. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో సచివాలయాల్లో జారీచేసే ధ్రువపత్రాలపై జగన్ బొమ్మను తొలగించి రాజముద్ర ఉన్న హైసెక్యూరిటీ ఫారాలు సచివాలయాలకు అందాయి. వైసీపీ పాలనలో జగన్ బొమ్మ వున్న హైసెక్యూరిటీ పత్రాలను నిలిపివేసి రాజముద్రతో ఉన్న ఫారాలను ప్రభుత్వం సచివాలయాలకు అందజేసింది. ఇకపై రాజముద్ర ఉన్న ధ్రువపత్రాలనే ప్రజలకు అందజేస్తారు.

పాత వెబ్‌ల్యాండ్‌ను పునరుద్ధరించాలి

ఏలూరు రూరల్, జూన్ 26 :రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా రీసర్వే జరిగిన గ్రామాల్లో ఎల్‌పీఎం, జాయింట్ ఎల్‌పీఈఎం వల్ల రైతులకు సంబంధించిన క్రయ, విక్రయాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సమస్యల దృష్ట్యా పాత వెబ్‌ల్యాండ్‌ను పునరుద్ధరించాలని ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు రీసర్వేపై అసంతృప్తిగా ఉన్నందున రీసర్వే రద్దు చేయాలని సీఎం చంద్రబాబునాయుడికి విజ్ఞప్తి చేశామన్నారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో ఎక్కువశాతం మంది ఉద్యోగులు లేనందున స్పెషల్ చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ, సీసీఎల్ఏ, అడిషనల్ సీసీఎల్ఏ సెక్రటరీ, రెవెన్యూ సిబ్బందిని ప్రక్షాళన చేసి మంచి అధికారులను నియమించాలని కోరారు. రెవెన్యూ శాఖలో అనేక సమస్యలు కొంతకాలంగా పెండింగ్ లో ఉండడం వల్ల సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారని, ఆయాశాఖల్లో అధికారులను నియమించాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

30న పోలవరానికి విదేశీ నిపుణుల బృందం రాక

పోలవరం, జూన్ 26 : పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు విదేశీ నిపుణుల బృందం ఈనెల 30న వస్తున్నారని, పరిశీలన కార్యక్రమాల్లో పాల్గొంటారని పోలవరం ప్రాజెక్టు ఈఈ మల్లికార్జునరావు బుధవారం తెలిపారు. ఈనెల 29వ రాత్రికి పోలవరం ప్రాజెక్టుకి ఈ బృందం చేరుకుని ప్రాజెక్టు అతిథి గృహంలో బస చేస్తారని, 30 ఉదయం నుంచి పోలవరం ప్రాజెక్టులో ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, డయాఫ్రంవాల్ ప్రాంతాలను ఇతర ప్రాంతాలను పరిశీలిస్తారని తెలిపారు. ఈనెల 27న ఈ బృందం పోలవరం రావాల్సి ఉండగా పలు కారణాల వల్ల తేదీలు మారినట్టు ఈఈ తెలిపారు.

క్రైం కార్నర్

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

భీమవరం క్రైం, జూన్ 26 : తాను సహజీవనం చేస్తున్న మహిళ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భీమవరం రూరల్ హెచ్‌సీ మహేశ్వరరావు తెలిపిన వివరాలివి.. కృష్ణా జిల్లా గుడివాడ మండలం మందపాడు గ్రామానికి చెందిన వెలగలేటి సుబ్బారావు(42)కు రేణుకతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఐదేళ్ల క్రితం మరో మహిళతో సహజీవనం చేస్తూ భీమవరం మండలం దొంగపిండి గ్రామంలోని ఒక రైతు చెరువుపై చేరాడు. అక్కడే వారిద్దరూ ఉండేవారు. సహజీవనం చేస్తున్న మహిళ మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోవడంతో సాయంత్రం చేపల చెరువులో వాడే పురుగుమందును తాగి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. భీమవరం ఆసుపత్రికి తీసుకు రాగా అతడు మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

మోటారు ఆన్‌చేస్తూ.. గ్రీన్ అంబాసిడర్ మృతి



మృతి చెందిన చంద్రపాల్

నరసాపురం రూరల్, జూన్ 26: కొప్పర్రు గ్రామంలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న చంద్రపాల్(55) బుధవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. తాగునీటి సరఫరా సమయంలో రేకుల షెడ్‌లో ఉన్న మోటారు ఆన్ చేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు, పంచాయతీ చెరువుకు సంబంధించిన షెడ్‌కు సరైన రక్షణ లేకపోవడం వల్లే మృతి చెందాడని స్థానికులు పేర్కొంటున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. అతడి మృతదేహాన్ని ఎంపీడీవో రమణారావు, ఈవోపీఆర్డీ శర్మ, సర్పంచ్ నల్లి వరలక్ష్మి సందర్శించి సంతాపం తెలిపారు.

సరిహద్దు వివాదం.. ఇరువర్గాల ఘర్షణ

లింగపాలెం, జూన్ 26: లింగపాలెం మండలం, లింగపాలెంలో భూమి సరిహద్దు విషయంలో ఇరువర్గాల ఘర్షణ పడి దాడులు చేసుకున్న ఘటన జరిగింది. ధర్మాజీగూడెం ఎస్ఐ పి.చెన్నారావు తెలిపిన వివరాలివి.. లింగపాలెం గ్రామానికి చెందిన కోటగిరి శ్రీకాంత్, కోటగిరి రవీంద్ర, కోటగిరి శ్రీనివాస్ తమ భూమిసరిహద్దుల విషయమై గొడవపడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పరస్పరం కేసులు పెట్టుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెచ్చిపోతున్న గంజాయి మూకలు !

▸ గడ్డి వాములు దహనమే పరిపాటి ▸ పాకల్లో కాలిపోతున్న పశువులు



వరధనంలో కాలిపోయిన గేదెలు(ఫైల్)

పాలకొల్లు రూరల్, జూన్ 26 : పాలకొల్లు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గంజాయి మూకలు రెచ్చిపోతున్నాయి. గడ్డి వాము కనిపిస్తే చాలు అంటించి వేయడమే పనిగా పెట్టుకున్నారు. వారం రోజుల క్రితం గొల్లవానిచెరువు, నాగరాజు పేటల్లో రెండు వేర్వేరు ప్రాంతాల్లో పది ఎకరాల గడ్డి వాములను గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ ఘటన మరువక ముందే యలమంచిలి మండలం కాజ గ్రామంలో రెండు గడ్డి వాములను దగ్ధం చేశారు. ఈ ఘటనలో మూడు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. పాలకొల్లు మండలం వరధనం గ్రామంలో దొమ్మేటి నాగేశ్వరరావుకు చెందిన పాకను దగ్ధం చేయడంతో మూడు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్న వారు గంజాయికి అలవాటు పడినవారే చేస్తున్నారని పాడి రైతులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు తమకు ఫిర్యాదు అందలేదని ఏవిధమైన దర్యాప్తు చేపట్టకపోవడంతో గంజాయి మూకలు మరింత రెచ్చిపోతున్నాయి. ఈ ఘటనలను పోలీసులు సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేసి నిందితులను పట్టుకుని శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం

▸ చర్మం కాలి తీవ్రంగా గాయపడిన మూడు గేదెలు



కాజపడమరలో కాలిన గేదెలపాక, గడ్డివాము ఒళ్లంతా కాలిన గేదెలు

యలమంచిలి, జూన్ 26: కాజ పడమర గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గుబ్బల కృపారావుకు చెందిన గడ్డివాము దగ్ధం కావడంతోపాటు పక్కన ఉన్న గేదెల పాక పూర్తిగా కాలిపోవడంతో పాకలో ఉన్న మూడు గేదెలకు చర్మం తీవ్రంగా కాలిపోయింది. వీటిలో ఒకటి పాడిగేదె కాగా మిగిలినవి చూడి గేదెలు. పాడి గేదె దాదాపు 90శాతం ఒళ్లు కాలిపోయి పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన రెండు గేదెలు దాదాపు 50శాతం ఒళ్లు కాలి తీవ్రంగా గాయాలపాలయ్యాయి. మరో రైతు కడలి వేణుకు చెందిన గడ్డివాము పూర్తిగా తగలబడింది. ఈ సంఘటన రైతులు, స్థానికులకు సుమారు మూడు గంటల సమయంలో తెలియడంతో ఘటనాస్థలానికి చేరుకునేసరికే నష్టం జరిగిపోయింది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. పశువైద్యాధికారులు గాయపడిన గేదెలకు చికిత్స అందిస్తున్నారు. పాలు అమ్ముకుని జీవనం సాగించే గుబ్బల కృపారావు మూడు గేదెలు కాలి తీవ్రంగా గాయాలపాలవడంతో జీవనోపాధి కోల్పోయాడు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఆగంతకులు గడ్డివాములకు నిప్పంటించారని స్థానికులు చర్చించుకుంటున్నారు.



కామవరపుకోట సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి

అధికారులతో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సమీక్ష

కామవరపుకోట, జూన్ 26: అధికారులు, సిబ్బంది సమన్వయంతో సేవలందించి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మండలంలోని అధికారులు, ఉద్యోగులతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా సేవలందించాలని, ఇష్టం లేనివారు స్వచ్ఛందంగా వెళ్ళిపోవచ్చని స్పష్టం చేశారు. సమయపాలన పాటించాలని, ప్రజలకు చేరువలో ఉండాలని స్పష్టం చేశారు. మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, కోనేరు వెంకట సుబ్బారావు, ఘంటా సుధీర్‌బాబు, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, బాహుబలేంద్రుని నారాయణరాజు, షేక్ వలీ, సర్పంచ్‌లు పసుమర్తి పార్థసారధి బాబు, గూడపాటి కేశవరావు, వేముల నాగేశ్వరరావు, గోరింక దాసు పాల్గొన్నారు. ఎంపీడీవో స్వర్ణభారతి, ఏవో సత్యవాణి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎర్రకాలువ లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోని అంకాలంపాడు, గుంటుపల్లి, ఉప్పలపాడు, కామవరపుకోట ప్రాంతాలకు నీటి సరఫరా ఎమ్మెల్యే ప్రారంభించారు.

చింతలపూడిలో ఎమ్మెల్యే గృహప్రవేశం

చింతలపూడి, జూన్ 26: చింతలపూడి వెంకటరామబాగ్‌లో ఇల్లు అద్దెకు తీసుకున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్ బుధవారం గృహప్రవేశం చేశారు. పట్టణానికి చెందిన పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇటీవల చింతలపూడి కేంద్రంగా ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆయన పట్టణంలో నివాసం ఉంటున్నారు.

నగరంలో పారిశుధ్యం మెరుగుపర్చండి : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, జూన్ 26: నగరంలో పారిశుధ్యం మెరుగుపరిచి పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దాలని పారిశుధ్య సిబ్బందికి ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణపై బుధవారం సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. వన్‌టౌన్‌లో డ్రెయిన్‌లలో పూడిక తొలగించడం లేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతగా పని చేయాలన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్, కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, కార్పొరేటర్లు కర్రి శ్రీనివాసరావు, పప్పు ఉమామహేశ్వరరావు, తంగిరాల సురేష్‌బాబు, ఎంఈ కొండలరావు, ఎస్ఎంఆర్ పెదబాబు, ఇంజనీరింగ్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపం

వైసీపీ పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నిర్మాణంలో ఉన్న మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 5ఎంఎల్‌డీ మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం ప్రారంభించామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యం చేసిందన్నారు. త్వరితగతిన ప్లాంట్ పూర్తి చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

ఈ - చలానాలు రద్దు చేయాలి

నగరంలో ఆటోలు, ట్యాక్సీలపై విధించిన ఈ-చలానాలు రద్దు చేయాలని ఎమ్మెల్యే బడేటి చంటిని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం సమర్పించారు. యూనియన్ నాయకులు జే.గోపి, నూరిబాబు మాట్లాడుతూ పాతబస్టాండ్ ఫైర్‌స్టేషన్ సిగ్నల్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాల ద్వారా ఫైన్లు విధించే కార్యక్రమాన్ని నిలిపివేయాలన్నారు. నగరంలో 300ట్యాక్సీలపై రూ.30వేలు ఈ చలానాల పేరిట ట్యాక్స్‌లు వేయడం పట్ల డ్రైవర్లు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఈ చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తాటియాకులగూడెంలో ఎమ్మెల్యే క్షేత్రస్థాయి పర్యటన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, జూన్ 26: తాటియాకులగూడెంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బుధవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. పంచాయతీ కార్యాలయ రికార్డులు పరిశీలించారు. పంచాయతీలో సమస్యలు పరిష్కరించే మార్గాలపై సిబ్బందితో చర్చించారు. అనంతరం అంకన్నగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందించే సౌకర్యాలు, మెనూ అమలు, పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బోధన తీరుపై ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఐటీడీఏ ద్వారా పాఠశాల అభివృద్ధికి కావాల్సిన సదుపాయాల్ని అందజేస్తామని సిబ్బంది బాలికల విద్యా బోధన పట్ల శ్రద్ధ చూపాలన్నారు. గడ్డమణుగు రవికుమార్, పసుపులేటి రాము, కోలా మధు, నాయకులు చిర్రి రాంపండు, శాఖమూరి సాయి, పేరాబత్తుల రాజు ఉన్నారు.

ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు జనసేన నాయకుల సత్కారం

పోలవరం, జూన్ 26: ఎమ్మెల్యే చిర్రి బాలరాజును జనసేన నాయకులు బుధవారం పూలబొకే, పూలమాలతో సత్కరించారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయనను సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందని జనసేన మండల అధ్యక్షులు గునపర్తి చిన్ని అన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు తెలగంశెట్టి రాము ఇతర జనసేన నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైలం మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, జూన్ 26: ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు బుధవారం శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆయనతో పాటు భీమడోలు మండల జనసేన అధ్యక్షుడు పత్తి మదన్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు కృష్ణబలిజ సంఘం సన్మానం

జంగారెడ్డిగూడెం, జూన్ 26: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో టీడీపీ నేతలను కృష్ణ బలిజ సంఘం ప్రతినిధులు బుధవారం సత్కరించారు. జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్, చేను ప్రసాద్‌కు పట్టణ కృష్ణ బలిజ సంఘం అధ్యక్షుడు కంచర్ల అన్నవరం అధ్యక్షతన ఘన సన్మానం నిర్వహించారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

లోక్‌సభ స్పీకర్‌ను కలసిన ఎంపీ మహేష్



ఏలూరు టూటౌన్, జూన్ 26: లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కలసి శుభాకాంక్షలు తెలిపారు. మహేష్‌కుమార్‌తో పాటు టీడీపీ సహచర ఎంపీలు పాల్గొని స్పీకర్ ఓం బిర్లాను అభినందించారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు



తాగునీటి పైపు లీకేజీ సరి చేస్తున్న సిబ్బంది

భీమడోలు, జూన్ 26: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, డయేరియా, మలేరియా, ఇతర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఈవోఆర్డీ సుందర్ తెలిపారు. ఈనెల 26 నుంచి 29 వరకూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భీమడోలు తదితర ప్రాంతాల్లో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటి ఆవరణలో ఉన్న చెత్త, నీటి నిల్వ సామాగ్రి తొలగించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో పైపు లీకేజీ మరమ్మతు చేపట్టామన్నారు. భీమడోలు, అంబర్‌పేట, పోలసానపల్లి మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించామన్నారు. గ్రామ కార్యదర్శులు వెంకట్రావు, జయరామకృష్ణ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

11 మంది చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు క్రైం, జూన్ 26: రెడ్‌క్రాస్ భవనంలో 11 మంది తలసేమియా బాధిత చిన్నారులకు రక్తమార్పిడి బుధవారం నిర్వహించినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి తెలిపారు. కొంత మంది పిల్లలు రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతుంటే యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలు నాశనం చేసుకోవడం దురదృష్టకరం అన్నారు. మానవత సభ్యులు టి.రామకృష్ణ, రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వర ప్రసాదరావు, డాక్టర్ జి స్పందన, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు, పీఆర్వో కెవి రమణ పాల్గొన్నారు.



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెట్రిసెల్వికి మొక్కలు, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి, జేసీ లావణ్యవేణి, ఐటీడీఏ పీవో సూర్యతేజ, ఆర్డీవో ఖాజావలి, జంగారెడ్డిగూడెం అధికారులు, ఏపీ ఎన్జీవో సంఘ నేతలు

బాధ్యతాయుతంగా పనిచేయండి

అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి దిశానిర్దేశం

ఏలూరు కలెక్టరేట్, జూన్ 26: ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల అమలులో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టరేట్‌లోని సూపరింటెండెంట్‌లు, అధికారులు, సిబ్బందిని కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్‌లో బుధవారం పలు విభాగాల సెక్షన్ల అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మెరుగైన పనితీరుతో అప్పగించిన పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్టాబ్లిస్‌మెంట్, కోఆర్డినేషన్, మినిస్ట్రీరియల్ సెక్షన్, భూసేకరణ, తదితర విభాగాల అధికారులు, సిబ్బంది ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్యత అంశాలను క్షుణ్ణంగా తెలుసుకుని ఏ రోజుకారోజు నివేదికలు తయారుచేసి సమర్పించాలన్నారు. సమావేశంలో డీఆర్వో డి.పుష్పమణి, ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం కలెక్టర్ వెట్రిసెల్విని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్కను అందజేశారు. ఎస్పీ డి.మేరీప్రశాంతి, ఎన్జీవో నాయకులు, ఆర్డీవో ఖాజావలీ, పలువురు ఉన్నతాధికారులు, వివిధ సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

● ఏలూరు క్రైం: బాధిత మహిళల సహాయం కోసం ఏర్పాటు చేసిన వన్‌స్టాప్ సఖి సెంటర్‌లో మెరుగైన సేవలందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో దిశ వన్ స్టాప్ సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. బాధిత మహిళలు, పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఐసీడీఎస్ పీడీ పద్మావతి, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ సీహెచ్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రేవి యర్ నగర్‌లోని ఉద్యోగినుల వసతి గృహాన్ని సందర్శించి అక్కడ మహిళలకు అందుతున్న సేవలను పరిశీలించారు.

● బుట్టాయగూడెం: కలెక్టర్ కె.వెట్రి సెల్విని కేఆర్‌.పురం ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ మర్యాదపూర్వకంగా కలుసుకుని పచ్చని మొక్కను అందజేసి అభినందనలు తెలియజేశారు.

● ఏలూరు ఎడ్యుకేషన్: బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ కె.వెట్రిసెల్విని పలు ఉద్యోగ సంఘాల జిల్లానాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అభివృద్ధిలో ఉద్యోగులు తనకు సహకరించాలని, సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలసిన వారిలో ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ సీహెచ్.శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.రామారావు, నాయకులు శ్రీధర్‌రాజు, సత్యనారాయణ, నరేంద్ర, గంగాధర్, నారాయణ, రమేష్, లక్షణ్‌కుమార్, మహిళా విభాగం ప్రతినిధులు మల్లిక, సత్యభారతి, ఝాన్సీ తదితరులున్నారు. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపినవారిలో ఏపీ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.విద్యాసాగర్, ఏపీజేఏసీ-అమరావతి జిల్లా చైర్మన్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎ.ప్రమోద్‌కుమార్, మహిళా విభాగం చైర్‌పర్సన్ సుందరి, జిల్లా నాయకులు మాధవి, వెంకటేశ్వరరావు, స్వామి, రాజరత్నకుమార్, రాంబాబు, వీరబాబు, రాఘవులు, శాంతకుమారి, గౌరీదేవి, ఝాన్సీలక్ష్మీబాయి, దివ్య, యామిని, తదితరులు ఉన్నారు.

● జంగారెడ్డిగూడెం: కలెక్టర్ వెట్రిసెల్విని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య, దేవదాయ శాఖాధికారి సీహెచ్.రంగారావు, తహసీల్దార్ కె.స్లీవజోజి, మద్ది క్షేత్రం ఈవో ఆకుల కొండలరావు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మద్ది క్షేత్రం వేద పండితులు కలెక్టర్‌కు వేదాశీర్వాదాలు అందజేశారు.



భీమడోలు, పెదపాడు, చింతలపూడి, పోలవరంలో మాదకద్రవ్య నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీస్, ఎక్సైజ్, కోర్టు సిబ్బంది, న్యాయాధికారులు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు

మాదకద్రవ్యాలతో

భవిష్యత్ నాశనం

సమష్టిగా నివారిద్దాం : ఎస్పీ మేరీ ప్రశాంతి



ఏలూరులో నిర్వహించిన ర్యాలీలో ఎస్పీ, పోలీసు అధికారులు

ఏలూరు క్రైం, జూన్ 26: మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. జాతీయ మాదకద్రవ్య నివారణ దినోత్సవం సందర్భంగా ఏలూరులో పోలీస్ అధికారులు, సిబ్బంది, ఎస్ఈబీ అధికారులు విద్యార్థులతో బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో గొప్పవాళ్ళను చేయాలనే ఆశతో ఉంటే కొంత మంది యువత డ్రగ్స్‌కు అలవాటుపడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. డ్రగ్స్ సరఫరా చేసేవారి ఆట కట్టించడానికి పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉన్నామని, టోల్‌ఫ్రీ నెంబర్ 14500 లేదా సమీపంలో పోలీస్ వారికి తెలియజేయాలని ఎస్పీ సూచించారు. ఎస్ఈబీ ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీ ఈ శ్రీనివాసులు, సీఐలు, అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంతో పిల్లల భవిష్యత్ అంధకారంగా మారుతుందని, వాటికి దూరంగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. గాంధీ మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం కె కృష్ణప్రసాద్, వన్‌స్టాప్ సఖి సెంటర్ స్టాండింగ్ కౌన్సిల్ కృష్ణవేణి, ప్యానల్ లాయర్లు కె.వెంకటేశ్వరరావు, కె.రత్నరాజు పాల్గొన్నారు.

● పోలవరం : మాదక ద్రవ్యాల నివారణకు యువత కృషి చేయాలని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కోలా వీరబాబు పిలుపునిచ్చారు. పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పోలీస్ సిబ్బంది, ఎస్ఈబీ సిబ్బంది అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల భారిన పడకుండా ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థితులు పొందాలని సూచించారు.

● చింతలపూడి: మాదకద్రవ్యాలు యువత జీవితాలను నాశనం చేస్తాయని, వాటిని దరిచేరనీయవద్దని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు అన్నారు. కోర్టు ఆవరణలో మండల న్యాయసేవా కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల మత్తులో యువత పడరాదని, అక్రమ రవాణా అరికట్టడానికి బాధ్యత చేపట్టాలని ఆయన సూచించారు. న్యాయవాదులు, సోషల్ వర్కర్లు పాల్గొన్నారు.

● పెదపాడు: డ్రగ్స్ బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై కె.శుభశేఖర్ అన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల అనర్థాలను వివరిస్తూ జూనియర్ కళాశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

● భీమడోలు: డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీఐ రవికుమార్, ఎస్ఈబీ సీఐ గిరిజ సత్యకుమారి పిలుపునిచ్చారు. వేంకటేశ్వర కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులతో కలసి డ్రగ్స్, ఉమెన్ ట్రాఫికింగ్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. భీమడోలు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. మాదకద్రవ్యాల నిరోధానికి ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ సుధాకర్, ఎస్ఈబీ ఎస్ఐ వీవీ.లక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ నాగరాజు, పోలీసు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఈబీ సీఐ వై.పట్టాభి చౌదరి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్య నిరోధక దినోత్సవం నిర్వహించారు. మాదక ద్రవ్యాల అలవాటుతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సింగనపూడి దళితులు

దళితులకు భూమిని అప్పగించి న్యాయం చేయాలి

ఏలూరు కలెక్టరేట్, జూన్ 26: తమ భూమిని తమకు అప్పగించి న్యాయం చేయాలంటూ ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో సింగనపూడి దళితులు కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సింగనపూడి గ్రామానికి చెందిన 20 దళిత కుటుంబాలకు 15.59 ఎకరాలు భూమిని ప్రభుత్వం ఇవ్వగా, 1925 నుంచి ఫీల్డ్‌లేబర్, కోఆపరేటివ్ సొసైటీ పేరుతో దళితులు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. 1992లో చేపలసాగుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, పెట్టుబడి పెట్టలేక కైకలూరుకు చెందిన మాడపాటి కృష్ణప్రసాద్‌కు లీజుకు ఇచ్చారన్నారు. కొంతకాలం తర్వాత భూమిలోకి హక్కుదారులను రానివ్వకుండా దౌర్జన్యం చేస్తూ సాగుచేసుకుంటున్నాడన్నారు. కృష్ణప్రసాద్, దళితులపై దౌర్జన్యం చేసి చేపలసాగుచేస్తున్నాడని ఆరోపించారు. సమస్యను పరిష్కరించి దళితుల భూమిని దళితులకే అప్పగించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జేసి లావణ్యవేణిని కలిసి వినతిపత్రం అందజేశారు. సింగనపూడి ఫీల్డ్ లేబర్, కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రా జగదీష్, సభ్యులు దావీదు, ఇశ్రాయేలు, సువర్ణరాజు, పౌల్, బొడ్డు ఆదాం పాల్గొన్నారు.

దెందులూరులో ఉచిత వైద్య శిబిరం



వైద్య సేవల కోసం వచ్చిన స్థానికులు

దెందులూరు, జూన్ 26: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. దెందులూరు లో రామదండు, మాతృదేవోభవ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు ఆసుపత్రుల వైద్యులు భూక్యా కృష్ణ, కొడాలి రామ్ ప్రవీన్, తవ్వా సంతోష్ రాహుల్, డాక్టర్ కీర్తి వైద్య సేవలందించారు. సుమారు 350 మందిని పరీక్షించి మందులను ఉచితంగా అందజేసినట్లు నిర్వాహకులు తులసీదాస్, శివాజీ, నూకరాజు, రామదండు, మాతృదేవోభవ ట్రస్టు సభ్యులు తెలిపారు,

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

టి.నరసాపురం, జూన్ 26: ప్రతిఒక్కరూ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏపిగుంట పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి తెలిపారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా చెత్త తొలగింపు పనులు చేయించారు. క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అంటువ్యాధులు దరిచేరవన్నారు. నివాసిత ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.రాజ్యలక్ష్మి, ఏఎన్ఎం జ్యోతి, ఆశా వర్కర్లు వజ్రకుమారి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలి నిజాయితీ

పోలవరం, జూన్ 26: దొరికిన సొమ్ములు అందజేసి పారిశుధ్య కార్మికురాలు నిజాయితీ చాటుకుంది. పోలవరం పంచాయతీలో పనిచేసే మాడుగుల పెద్దింట్లమ్మ బుధవారం ఉదయం తన పనుల్లో భాగంగా ఏటిగట్టు దిగువన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల కూడలిలో రోడ్లు ఊడుస్తుంది. అక్కడ ఆమెకు రూ.20 నగదు దొరికింది. సొమ్ము పోగొట్టుకున్న కర్రీ పాయింట్ చిలకా దేవి వెతుకులాడుతున్న తరుణంలో ఆమె సొమ్ము అప్పగించి తన నిజాయితీ చాటుకుంది. గ్రామస్థులు పలువురు పంచాయతీ సిబ్బంది ఆమెను అభినందించారు. కొన్ని నెలల క్రితం ఇదే పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికుడు వారా నాని తనకు దొరికిన రూ.40 వేల సొమ్మును పోగొట్టుకున్న ప్రగడపల్లి గ్రామ మహిళకు పోలీసుల సహాయంతో అందజేసి నిజాయితీ చాటుకున్న విషయం తెలిసిందే. పోలవరం పారిశుధ్య కార్మికుల నిజాయితీని పలువురు ప్రశంసించారు.

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

లింగపాలెం, జూన్ 26: బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేర్పాలని ఎంఈవో కె.రామారావు ఉపాధ్యాయులకు సూచించారు. విద్యావనరుల కేంద్రంలో బుధవారం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ఉపాధ్యాయులపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన ఉండాలన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాల రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎంఈవో రామారావు, ఎంఈవో-2 రవీంద్ర, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

లింగపాలెం, జూన్ 26: ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నారా లోకేశ్ యువసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి ఉప్పం మురళీకృష్ణ అన్నారు. ధర్మాజిగూడెం గ్రామంలోని బీసీ కాలనీలో ఎంఈవో జంగం రవీంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు చదువుపై దృష్టి ఉంచాలని, ప్రతి ఒక్కరికి చదువు మాత్రమే గుర్తింపు తీసుకువస్తుందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తుందని, వాటిని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలన్నారు. విద్యార్థులు బాల్యం నుంచి క్రమశిక్షణ కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో జంగం రవీంద్ర, హెచ్‌ఎం కండవల్లి కుటుంబరావు, ధర్మాజిగూడెం గ్రామానికి చెందిన పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోతునూరు హైస్కూల్‌లో నోట్ పుస్తకాలు పంపిణీ

దెందులూరు, జూన్ 26: ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని అభివృద్ధి చెందాల ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విశేష సేవలందిస్తున్నారని టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు నున్న లక్ష్మణ్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, బోడేటి మెహన్‌బాబు అన్నారు. పోతునూరు చింతమనేని అందించిన నోట్ పుస్తకాలను జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్ వలితో కలసి బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. నాయకులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

పెదపాడు, జూన్ 26: వట్లూరులోని బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ 150వ జయంతి బుధవారం నిర్వహించారు. తొలుత శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శివాజీ మహరాజ్ సంస్కరణలను కొనియాడారు. కార్యక్రమంలో నేతల రమేష్‌బాబు, మేతర అజయ్‌బాబు, దాసరి నాగేంద్రకుమార్, మల్లికార్జునరావు, భూపతి అప్పారావు, వేణుగోపాలరావు, ప్రదీప్, రాయప్ప, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి డిగ్రీ కళాశాలలో..

చింతలపూడి, జూన్ 26: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజి మనుమడైన సాహు మహరాజ్ తన పరిపాలనలో ప్రధాన సంఘటనలను వివరించారు. ఆయన హయాంలోనే చట్టాలు, ఉపకార వేతనాలు నిర్వహించారని, అంటరానితనం, మహిళల వెతలపై సంస్కరణలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు ముత్తారెడ్డికి అస్వస్థత

చింతలపూడి, జూన్ 26: చింతలపూడి తెలుగుదేశం నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి అస్వస్థతకు గురయ్యారు. ఛాతిలో నొప్పి రావడంతో ఆయనను విజయవాడ రమేశ్ హాస్పిటల్‌కు పరీక్షలు జరిపారు. అక్కడి నుంచి మెరుగైన పరీక్ష కోసం హైదరాబాద్ వెళ్లారని, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఐటీఐ ఉత్తీర్ణులకు జాబ్‌మేళా

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 26: ఐటీఐ ఉత్తీర్ణులకు బుధవారం సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల్లోని 19 ప్రముఖ కంపెనీలు హాజరయ్యాయి. మొత్తం 252మంది అభ్యర్థులు హాజరుకాగా 186 మంది వివిధ ఉద్యోగాలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ రజిత బుధవారం తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మదుభూషన్‌రావు, సెట్‌వెల్ సీఈవో మెహరాజ్, ప్రవీణ్‌కృష్ణ, డీఎస్‌డీవో సుదాకర్, డీఎల్‌టీసీ ప్రిన్సిపాల్ రవి పాల్గొన్నారు.

డీఎల్ఎడ్ పరీక్షకు 61మంది హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 26 : జిల్లాలో బుధవారం జరిగిన డీఎల్ఎడ్ సెమిస్టర్ పరీక్షకు 61మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఈవో అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు.

29న వైకల్య నిర్ధారణ, వైద్య శిబిరం

పెదవేగి, జూన్ 26: దివ్యాంగుల అవసరాలను గుర్తించి, వారికి అవసమైన ఉపకరణాలను అందించడానికి ఈనెల 29న దెందులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సీహెచ్.బుధవాస్ తెలిపారు. ఈ శిబిరంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల దివ్యాంగులు పాల్గొని సేవలు పొందవచ్చని సూచించారు. అర్హత కలిగిన దివ్యాంగులు సదరమ్ ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, వారికి సంబంధించిన యూడీఐడీ కార్డుతోపాటు కుల ధ్రువీకరణ పత్రాల నకళ్లను వెంట తీసుకుని వైద్య శిబిరానికి రావాలని ఆయన సూచించారు. రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు కూడా తీసుకురావాలని ఆయన తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** శాంతినగర్ 33-11కె.వి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనేల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ జె.పి.బి నటరాజన్ తెలిపారు. జె.వి.ఆర్ నగర్, కె.ఎస్.ఆర్ తోట, విద్యానగర్, సాయిబాబా టెంపుల్, శాతవాహన నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** జనసేన వన్‌టౌన్ మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికైన గిడుతూరి పద్మను రెడ్డి అప్పలనాయుడు అభినందించారు. జనసేన మహిళా విభాగం అభివృద్ధి చెందేందుకు చర్యలు తీసుకోవాలని, పార్టీ కార్యకలాపాలను విస్తృతపర్చాలని సూచించారు.
- మానవత ఫౌండేషన్ సేవలు అభినందనీయమని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. బుధవారం ఫౌండేషన్ ద్వారా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షురాలు కోడూరి కనకదుర్గ, సభ్యులు నాగేశ్వరరావు, చక్రపాణి బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.
- సత్రంపాడులోని లక్ష్మీగణపతి స్వామి ఆలయం వద్ద బుధవారం భక్తులు సామూహికంగా గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. తొలుత స్వామివారికి ఆలయ అర్చకులు రెండుచింతల రాఘవేంద్రశర్మ పంచామృతాభిషేకం జరిపి ప్రత్యేక అలంకరణ చేశారు.
- **కామవరపుకోట :** రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్వోలు విధులు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ రమేష్ కోరారు. సిబ్బంది, విఆర్వోలతో తహసీల్దార్ సమీక్షను నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ మొహిద్దీన్, శేషగిరి, ఆర్ఐ కొమ్మన ఇంద్ర విజయసారథి, వీఆర్వోలు పాల్గొన్నారు.
- కామవరపుకోట గుర్రాలచెరువు గట్టు వద్ద వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి కొబ్బరినీళ్ళతో అభిషేకం చేశారు. అనంతరం గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు.
- **పెదవేగి :** ప్రతి ఒక్కరూ నేత్రాలను అత్యంత జాగ్రత్తగా కాపాడుకోవాలని నేత్ర వైద్య నిపుణుడు చంద్రశేఖర్ అన్నారు. లక్ష్మీపురం సచివాలయంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 50 మంది వరకు ప్రజలకు నేత్ర పరీక్షలు చేసి మందులు అందజేశారు.
- **ఉంగుటూరు :** నారాయణపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, తహసీల్దార్ కే.వెంకట శివయ్య తెలిపారు. కృత్రిమ పరికరాల కోసం నిర్ధారణ చేయించుకోవాలన్నారు. ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం, ద్వారకా తిరుమల మండలాల దివ్యాంగులు పాల్గొనవచ్చని తెలిపారు.



కైకలూరులో మాట్లాడుతున్న న్యాయాధికారి లక్ష్మి



ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ వెంకట రమణ





కలిదిండి, ఆగిరిపల్లిలో ఉద్యోగులతో ప్రమాణం చేయిస్తున్న ఎంపీడీవోలు

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు

» వినియోగిస్తే జైలు » మాదకద్రవ్యాల వ్యతిరేక దినంలో వక్తలు » ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రమాణాలు

కైకలూరు, జూన్ 26: యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే విలువైన జీవితాన్ని కోల్పోవలసి వస్తుందని కైకలూరు సీనియర్ న్యాయాధికారి వీవీఎస్ లక్ష్మి అన్నారు. బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ యువత మాదకద్రవ్య రహితంగా సమాజాన్ని మార్చేందుకు సహకరించాలని కోరారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే తోటి యువత పోలీసులకు సమాచార మందించాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేంపాటి సాయి సత్యనారాయణ, సెక్రటరీ ఎంఎస్ఎస్ రాజు, న్యాయవాదులు పి. పవన్‌కాంత్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. జయలక్ష్మి పాల్గొన్నారు. అలాగే కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుజాత, వైస్ ప్రిన్సిపాల్ డి. ఉదయప్రకాష్, అధ్యాపక బృందం డాక్టర్ ఎం. హరిప్రసాద్, డాక్టర్ ఎం. విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎంపీడీవో దినతేజ్ అన్నారు. బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయాల సిబ్బందితో కలసి మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చటానికి తమ శక్తి మేర కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ వై.రాజారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వినియోగిస్తే జైలుకే

నూజివీడు టౌన్: మాదకద్రవ్యాల సేవనం వల్ల పదేళ్ల వరకు జైలుశిక్ష పడుతుందని, నూజివీడు సెబ్ సీఐ వెంకటరమణ అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై పోలీస్, సెబ్ అధికారులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే రుగ్మతలను సెబ్ సీఐ వెంకటరమణ వివరించారు. నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మాదకద్రవ్యాల సేవనం, అక్రమంగా కలిగి ఉంటే మూడు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. అంతేకాక మాదక ద్రవ్యాలు సేవించేవారు మానసిక రోగులుగా మారిపోతారన్నారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ట్రిపుల్ ఐటీ అధికారులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: మాదకద్రవ్యాలవైపు ప్రజలు వాటివైపు మళ్లకుండా చూడాలని ఎంపీడీవో శామ్యూల్ తన సిబ్బందితో ప్రమాణం చేయించారు. మాదక ద్రవ్యాలు ఎవరినైనా పీల్చిపిప్పి చేస్తాయని, త్వరగా మేలుకుంటే ఇబ్బంది ఉండదని ఆలస్యం చేస్తే ప్రాణాలకే ముప్పని శామ్యూల్ పేర్కొన్నారు.



మేక కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

మేకను చంపిన చిరుత

» వింజరం పంచాయతీ సున్నాలగండిలో ఘటన

పోలవరం, జూన్ 26 : చిరుత పులి దాడిలో మేక మృతి చెందిన ఘటన పోలవరం మండలం వింజరం పంచాయతీ సున్నాలగండి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలవరం అటవీక్షేత్రాధికారి ఎస్.దావీదురాజు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన మడకం కోటేశ్వరరావు అనే మేకల కాపరికి చెందిన పాకలో ఒక మేక కనిపించక పోవడంతో సమీప అటవీ ప్రాంతంలో వెతికినట్టు తెలిపారన్నారు. మేకల పాకకు కొంతదూరంలో తలభాగం పూర్తిగా తిని మిగిలిన మేక కళేబరం కనిపించిందని మేకల కాపరి ఇచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతానికి అటవీశాఖ సిబ్బందిని పంపినట్టు తెలిపారు. సిబ్బంది సేకరించిన పాదముద్రల మేరకు దాడికి పాల్పడింది చిరుతపులేనని ధ్రువీకరించినట్టు తెలిపారు. మేక కళేబరాన్ని పశువైద్యులతో పరీక్షించి మేకల కాపరికి అటవీశాఖ నుంచి పరిహారం అందిస్తామని.. అడవుల్లోకి పశువులను మేపడానికి వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని గ్రామస్థులకు సూచించినట్టు తెలిపారు.

ఆగని చోరీలు..

వ్యవసాయ బోర్ల కేబుల్, సామగ్రి అపహరణ



చింతలవల్లిలో బోరు వద్ద కేబుల్ వైర్ కట్ చేసిన దుండగులు

ముసునూరు, జూన్ 26: మండలంలోని పలు గ్రామాల్లో పొలాల్లోని వ్యవసాయ బోర్ల కేబుల్, ఇతర సామగ్రిని దుండగులు అపహరించుకుపోతున్నారు. తాజాగా చింతలవల్లిలో మంగళ, బుధవారాల్లో సుమారు 15 వ్యవసాయ బోర్లుకు సంబంధించిన సామగ్రి చోరీకి గురైంది. బోరు దగ్గర నుంచి సుమారు 20 మీటర్ల పొడవున్న కేబుల్ వైర్, ఫ్యూజుల్లో రాగివైర్, స్టార్టర్లలోని రాగివైర్లు సైతం చోరీకి గురికావడంతో పల్లిపాము సుగుణరావుతోపాటు మరికొంతమంది రైతులు ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక బోరుకు సంబంధించిన సామగ్రి విలువ రూ. 10 వేల నుంచి 15 వేలు వరకు ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొద్ది నెలలుగా ముసునూరు, గోపవరం, తాళ్ళవల్లి, చెక్కపల్లి, కొర్లకుంట తదితర గ్రామాల్లో ఈ చోరీలు జరగడంతో బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసులు కూడా నమోదయ్యాయి. అయితే దొంగల ఆచూకీ లభ్యం కాలేదు. చోరీలు కొనసాగుతూనే ఉన్నాయని రైతులు వాపోతున్నారు. ఈ విధంగా వ్యవసాయ బోర్ల కేబుల్, సామగ్రి చోరీకి గురైతే భవిష్యత్‌లో వ్యవసాయం చేయలేమని రైతులు అంటున్నారు. ఇప్పటికైన ఈ చోరీలను నియంత్రించేలా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల రైతాంగం కోరుతోంది.

మేథోమథన సదస్సును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న చలసాని రామారావు

నూజివీడు, జూన్ 26: ఆదాయ పన్ను సీలింగ్ పరిధిని రెట్టింపు చేయాలని, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. జూలై 6, 7 తేదీల్లో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర మేథోమథన సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ నూజివీడు అమర్‌భవన్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావుతో కలసి ఆయన మాట్లాడు తూ వేతనంపై ఆధారపడిన ఉద్యోగుల ఆదాయపు పన్ను సీలింగ్ పరిధి రెట్టింపు చేయడంతో పాటు సామాజిక భద్రతకు రూ.9 వేలు పింఛన్ ఇవ్వాలని, ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖామంత్రి నిర్మలాసీతారామన్‌ను కలిసి కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేశాయన్నారు. ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, పీఏసీఎస్ నాయకులు ముఖర్జి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత వితరణతో రహదారికి మరమ్మతులు



చాట్రాయి, జూన్ 26: మండలంలో సోమవరం-తుమ్మగూడెం రహదారిలో పెద్ద చెరువు కట్టపై రహదారి శిథిలావస్థకు చేరి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో స్థానిక టీడీపీ నాయకుడు యర్రోజు రామ్‌ప్రసాద్ తన సొంత నిధులతో ట్రాక్టర్లు ఏర్పాటు చేసి గ్రావెల్‌తో గోతులు పూడ్చించారు. అధ్వానంగా ఉన్న రహదారికి మరమ్మతులు చేయించినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉప ముఖ్యమంత్రి దృష్టికి కైకలూరు సమస్యలు



పవన్‌ను కలసిన ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, జూన్ 26: కైకలూరు నియోజకవర్గంలోని తాగునీరు, కొల్లేటి సమస్యలను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. బుధవారం మంగళగిరి జనసేన కార్యాల యంలో పవన్ కల్యాణ్‌ను కలిసి నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. కైకలూరు నియోజకవర్గంలో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొందని ఉప్పునీటితో భూగర్భ జలాలు నిండిపోవడంతో ప్రజలు తాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నారని ప్రతి గ్రామానికి కొత్త పైప్‌లైన్లతో పాటు ఆర్వోప్లాంట్ల నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. కొల్లేరు ప్రజల జీవనోపాధికి శాశ్వత పరిష్కారం చూపేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆయన చర్చించారు. వీటిపై పవన్‌కల్యాణ్ సానుకూలంగా స్పందించారని కామినేని తెలిపారు.

రహదారి విస్తరణకు సర్వే



చాట్రాయి, జూన్ 26: మండలంలోని చిత్తపూరు-బూరుగుగూడెం రహదారి (సీటీ రోడ్డు)ని డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు అంచనాలు రూపొందించేందుకు బుధవారం నూజివీడు ఆర్‌అండ్‌బీ డీఈఈ బాబూరావు సర్వే నిర్వహించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి విజ్ఞప్తికి స్పందించిన మంత్రి పార్థసారథి ఇటీవల ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్‌కు ఈ రహదారికి అంచనాలు తయారు చేయాలని లేఖ రాసిన విషయం విదితమే. ఉన్నతాధికారుల ఆదేశాలతో డీఈఈ చిత్తపూరు నుంచి బూరుగుగూడెం వరకు రహదారి పరిధిలోని చాట్రాయి, బూరుగుగూడెం, జనార్ధనవరం, చిత్తపూరు గ్రామాల్లో పర్యటించి కొత్త కల్వర్టుల నిర్మాణం, రహదారి విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ లైన్లు తదితర అంశాలు పరిశీలించి నమోదు చేశారు. స్థానిక ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు.

డంపింగ్ యార్డ్‌ను మార్చకుంటే..
రహదారిని దిగ్బంధిస్తాం

అధికారులకు కాలనీ వాసుల హెచ్చరిక



పంచాయతీ కార్యాలయం వద్ద స్థానికులు

ఆగిరిపల్లి, జూన్ 26: పోరాటం తప్ప మరో దారి లేదని ఆగిరి పల్లి -గన్నవరం రహదారి సమీపాన గల కాలనీవాసులు అధికారులను హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో 'ఉక్కిరి బిక్కిరి' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి బుధవారం ఎస్వీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, టీచర్లు, స్థానికులు పెద్ద ఎత్తున కార్యాలయానికి తరలి వచ్చి 2009 నుంచి తాము పంచాయతీకి పెట్టుకున్న అర్జీలు చూపించారు. డంపింగ్ యార్డ్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. చెత్త తగలబెడుతుంటే స్కూల్లో పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని, ఇలాగే కొనసాగితే ఊరుకునేది లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్ వారిని సముదాయించినా శాంతించలేదు. అనంతరం వారు ఎమ్మార్వోని ఆశ్రయించగా ఎమ్మార్వో కార్యదర్శిని పిలిపించి సమస్య త్వరగా పరిష్కరించాలని కోరారు. త్వరగా సమస్య పరిష్కరించకుంటే రహదారిని దిగ్బంధం చేస్తామని స్థానికులు హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హాస్టల్‌కు మౌలిక వసతులు కల్పిస్తాం



టాయ్‌లెట్స్ డోర్స్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కలిదిండి, జూన్ 26 : కోరుకొల్లు ఎస్సీ బాలికల హాస్టల్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని వార్డెన్ నాగమణి తెలిపారు. ఈ నెల 25న ఆంధ్రజ్యోతిలో "సమస్యల కేరాఫ్ కోరుకొల్లు హాస్టల్" శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వార్డెన్ మాట్లాడుతూ మరుగుదొడ్లను శుభ్రం చేయించి వాటి తలుపులను బాగుచేయిస్తున్నామని, అలాగే గదుల్లో ఫ్యాన్లు మరమ్మతులు చేయించి దోమల బెడద లేకుండా చేస్తామన్నారు. హాస్టల్ భవనం మరమ్మతులు, పైపులైన్ ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలసిన నేత కార్మికులు



ముదినేపల్లి, జూన్ 26 : చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుప ర్చాలని మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను పెదగొన్నూరు చేనేత సంఘ నాయకులు కోరారు. నేత కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి నందం సాయిబాబు ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు, టీడీపీ నాయకులు తుమ్మలచర్ల గణపతి, దొడ్డిపట్ల సుధాకృష్ణ బుధవారం లోకేశ్‌ను ఉండవల్లిలో కలిశారు. చేనేత సహకార సంఘాలను పునరుద్ధరించాలని, పెదగొన్నూరు టీడీపీ నాయకుడు సుధాకృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని లోకేశ్‌ను కోరారు.

హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయరూ..



చాట్రాయి, జూన్ 26: మండలంలోని పోలవరంలో పునాదుల్లోనే నిలిచిపోయిన హెల్త్ సబ్ సెంటర్ భవనాన్ని పూర్తి చేయాలని కోరుతూ మంత్రి పార్థసారథికి, గ్రామ అభివృద్ధి కమిటీ కన్వీనర్ చాగంటి నరసింహారావు వినతి పత్రం అందజేశారు. ఉపాధి నిధులతో రెండేళ్ళ క్రితం ఈ భవన నిర్మాణం ప్రారంభించి బిల్లులు రాక పునాదుల్లోనే ఆపివేశారని, ప్రస్తుతం హెల్త్ సబ్ సెంటర్ చిన్న అద్దె భవనంలో కొనసాగుతుండటంతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారని భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

మంత్రి ఆదేశాలతో సిల్ట్ తొలగింపు



నూజివీడు టౌన్, జూన్ 26: నూజివీడు చిన్నగాంధీ బొమ్మ సెంటర్లో డ్రైన్‌లు పూడిపోయి, కొద్దిపాటి వర్షానికే రహదారులు డ్రైన్‌లుగా మారడంపై స్థానికులు మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో డ్రైన్లలో సిల్ట్ తొలగించాలని మంత్రి పార్థసారథి మున్సిపల్ అధికారులను ఆదేశించడంతో నూజివీడు మున్సిపల్ సిబ్బంది మంగళవారం రాత్రి డ్రైన్‌లలో సిల్ట్‌ను తొలగించారు.

పదోన్నతులు కల్పించాలని వీఆర్‌ఏల వినతి



కైకలూరు, జూన్ 26: తమకు పదోన్నతులు కల్పించాలని మంత్రి నారా లోకేశ్‌కు వీఆర్‌ఏల సంఘం వినతి పత్రాన్ని అందజేసింది. బుధవారం అమరావతిలోని సెక్రటేరియెట్‌లో లోకేశ్ కలసిన వీరు 12 సంవత్సరాలుగా పదోన్నతులు కల్పించలేదన్నారు. రాష్ట్రంలో 2 వేలకు పైగా వీఆర్వో పోస్టులు ఖాళీగా ఉన్నాయని అర్హత కల్గిన వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించాలని కోరారు. కైకలూరు వీఆర్‌ఏలు షేక్ బేగం, నాగలక్ష్మి, కే ప్రేమ్‌చంద్, ఎస్. నాగరాజు, పి. రాజశేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విత్తన రైతుల సమస్యలు పరిష్కరించాలి

నూజివీడు, జూన్ 26: తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రి పార్థసారథితో కలసి నూజివీడు విత్తనపత్తి రైతులు రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరపు అచ్చెన్నాయుడుకి బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విత్తనపత్తి, మొక్కజొన్న రైతులకు బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణపరిమితిని పెంచాలని నూజివీడు ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు మంత్రి అచ్చెన్నాయుడిని కోరారు. గతంలో విత్తనపత్తి సాగుచేసిన రైతులకు గుంటూరుకు చెందిన ఒక కంపెనీ బకాయిలను చెల్లించలేదని, సదరు కంపెనీ పై చర్యలు చేపట్టాలని కోరారు. విత్తన రైతులు అక్కినేని చంద్రశేఖర్, కాజా రాంబాబు, పిన్నిబోయిన చింతారావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో ఇళ్లను పరిశీలించిన అధికార బృందం



చాట్రాయి, జూన్ 26: వైసీపీ హయాంలో నిర్మించిన కాలనీ ఇళ్ళను బుధ వారం జంగారెడ్డిగూడెం హౌసింగ్ ఈఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం పరిశీలించింది. నరసింహారావుపాలెం, సి. గుడిపాడు, పర్వతాపురం, బూరుగ్గూడెం, పోతనపల్లి గ్రామాల్లో ప్రతి లబ్ధిదారు ఇంటిని పరిశీలించి విడుదలైన బిల్లులు, సమస్యలు తెలుసుకొని వివరాలు నమోదు చేశారు. టి. నర్సాపురం హౌసింగ్ ఏఈ రాధాకృష్ణ, చాట్రాయి వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివిధ మండలాల హౌసింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాగితకు జన్మదిన శుభాకాంక్షలు



కలిదిండి, జూన్ 26 : పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ జన్మదినం సందర్భంగా బుధవారం కలిదిండి మండల బీసీ నేతలు బంటుమిల్లిలో ఆయన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంగ్రాజు శ్రీనివాస్, నాయకులు నాగిడి వీరబ్రహ్మం, తిరుమాని పాండురంగారావు, మోకా నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రగా వెంకటగిరి చేరిన తెలుగు తమ్ముళ్లు

చాట్రాయి, జూన్ 26: మర్లపాలెం నుంచి 16వ తేదీన కాలినడకన పెద్ద తిరుపతి బయలుదేరిన 10 మంది సభ్యుల టీడీపీ బృందం బుధవారం సాయంత్రానికి నెల్లూరు జిల్లా వెంకటగిరి చేరుకుంది. కొలుసు పార్థసారథి మంత్రిగా, పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ఎంపీగా, చంద్రబాబు సీఎంగా పదవులను చేపట్టగానే కాలినడకన శ్రీవారి దర్శనానికి వస్తామని టీడీపీ మర్లపాలెం నాయకులు, కార్యకర్తలు మొక్కుకున్నారు. అనుకున్నది నెరవేరడంతో పాదయాత్ర చేస్తున్నారు. గురువారం రాత్రికి అలిపిరి చేరుకొని మెట్ల మార్గం ద్వారా తిరుమల చేరుకొని స్వామిని దర్శించుకుంటామని బృందం సభ్యుడైన ఉప సర్పంచ్ వెల్ది రాజారావు తెలిపారు.

దాతల సహకారంతో అన్న క్యాంటీన్



కైకలూరు, జూన్ 26: దాతల సహకారంతో ప్రతి రోజు పేదలకు ఉచితంగా అన్నదానం చేయడం అభినం దనీయమని పలువురు ఎన్డీయే నాయకులు పేర్కొన్నారు. బుధవారం కైకలూరుకు చెందిన వడుపు వెంకటేశ్వరరావు ఆర్థిక సాయంతో సహకారంతో అన్న క్యాంటీన్లో 400 మంది పేదలకు ఉచితంగా భోజనాన్ని పంపిణీ చేశారు. కూటమి నాయకులు పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, పేరిచర్ల వినయవర్మ, తోట లక్ష్మి, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో బహుపరాక్



చాట్రాయి, జూన్ 26: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి జ్యోతి కోరారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా మండలంలోని చిత్తపూరులో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం సీజనల్ వ్యాధులపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు, నివాస ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా తొలగించాలని, దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తీవ్ర జ్వరం, చలి, వణుకు, చెమటలు పట్టటం వంటి లక్షణాలు ఉంటే మలేరియాగా అనుమానించి వెంటనే వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలని అన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ ప్రభాకర్, ఏఎన్‌ఎం సామ్రాజ్యం, ఎంయల్‌హెచ్‌పి వీరాస్వామి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

ముసునూరు, జూన్ 26: ముసునూరు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ బడుపుల వలీవ కుమారి పనితీరుపై అందిన ఫిర్యాదుపై బుధవారం అధికారులు విచారణ చేశారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఏపీవో రోజ్‌లీల, ఈసీ జయప్రసాద్ ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేశారు. పనికి సంబంధించిన డిమాండ్‌ను కూలీలకు ఇవ్వడం లేదని, మస్తర్లు సరిగా వేయకపోవడం తోపాటు మరికొన్ని విషయాలను కూలీలు ఎంపీడీవోకు వివరించారు. సమగ్ర నివేదికను తయారుచేసి ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు అందజేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. విచారణలో నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ (బాబి), ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, నియోజకవర్గ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను, వార్డు సభ్యుడు ఎన్.రాంబాబు పాల్గొన్నారు.

రేపు బలివే ఆలయ భూముల కౌలుకు వేలం

ముసునూరు, జూన్ 26: బలివే రామలింగేశ్వరస్వామి ఆలయ భూములకు కౌలు వేలంను ఈ నెల 28న నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో ఎన్.సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బలివే గ్రామంలోని 7 ఎకరాల భూమికి మూడేళ్లపాటు కౌలు హక్కు పొందేందుకు ఆ రోజు ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు.

ఇసుక అక్రమ తరలింపు.. వాహనం స్వాధీనం

ముసునూరు, జూన్ 26: మండలంలోని వలసపల్లి తమ్మిలేరు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న టాటా ఏస్ వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. వలసపల్లికి చెందిన సుదగాని నాగభూషణం తన వాహనంతో కొద్దిరోజులుగా రాత్రిపూట తమ్మిలేరు ఇసుకను లోడ్ చేసుకుని ఇతర ప్రాంతాలకు తరలించి అధిక రేట్లకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి టాటా ఏస్ వాహనంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా గ్రామస్థుల సమాచారం మేరకు ఎస్ఐ వి.వాసు తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. ఈ వాహనాన్ని ముసునూరు తహసీల్దార్ జవహర్ బాజికి రిఫర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పుస్తకాలు, పెన్నుల వితరణ



మండవల్లి, జూన్ 26: విద్యార్థులు ఉన్నత విద్యన భ్యసించి మంచి స్థాయికి చేరుకో వాలని మండవల్లి ఎంఈవో డి రామారావు అన్నారు. బుధవారం గన్నవరం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ 1, 2లలో విద్యార్థులకు ఎన్డీయే నాయకులు కూనపురెడ్డి కోటేశ్వరరావు, వడ్లాని వీరబాబు, నామాల చైతన్య, ముచ్చర్ల అయ్యప్పస్వామి, గుబిలి శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో నోటు పుస్తకాలు, పెన్నులు ఇతర సామగ్రి పంపిణీ చేశారు. గుంజాల శ్రీను, టేకు రమేష్, గుడివాడ గణేష్, ప్రధానోపాధ్యాయుడు పి. పాండురంగారావు, ఎం. పావని, జి. పవన్‌కుమార్, గాది నాని, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం పనుల పరిశీలన

మండవల్లి, జూన్ 26: మండవల్లి మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న అంగన్వాడీ-1 కేంద్రాన్ని ఎన్‌హెచ్ 165 విస్తరణ పనులలో భాగంగా కొంత భాగం తొలగించగా తిరిగి నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయి. బుధవారం డీఈ పగడాల సురేష్‌బాబు, ఏఈ సిహెచ్ కమల్‌రాజులు పనులను పర్యవేక్షించారు. బీజేపీ నాయకులు గంగునేని వరప్రసాద్, అంగన్వాడీ కార్యకర్త కె. సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి : ఎంఈవో

ముసునూరు, జూన్ 26: విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి, వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని మండల విద్యాశాఖాధికారి బీవీ సుబ్బారావు ఉపాధ్యాయులకు సూచించారు. కాట్రేనిపాడు నార్త్ దళితవాడలోని మండల పరిషత్ పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, భోజన మెనూ పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యాం శాలలోని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యానికనుగుణంగా బోధించి వారిని సానబట్టాలని సూచించారు. మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదులు వస్తే సహించనన్నారు.

ఆలయ చరిత్ర పుస్తకావిష్కరణ



ఆగిరిపల్లి, జూన్ 26: శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ చరిత్ర పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. 1971లో ఆగిరిపల్లికి చెందిన వేమూరి వెంకట్రామ సుబ్రహ్మణ్యం శోభనాచల సుప్రభాతం, స్వామి స్తోత్రాలు రచించి ముద్రించారు. ఇప్పుడు ఆయన కుమారుడు వేమూరు శ్రీనివాసమూర్తి, కుమార్తెలు స్వామివారి ఆలయ చరిత్ర రచించి స్వామివారి సన్నిధిలో ఆవిష్కరించారు. ఈవో డి. సురేష్‌బాబు, ఆలయ అర్చకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.